మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 173 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag... Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad...



## లాభాల ఇస్రో

**- సంస్థపై వెచ్చించే ప్రతి రూపాయికి రెండున్నర రెట్లు లాభం..!**

**- ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమ్‌నాథ్ వెల్లడి**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
భారత అంతరిక్ష సంస్థ ఇస్రోపై వెచ్చించే ప్రతీ రూపాయికి భారీగా లాభం వస్తోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమ్‌నాథ్ ఓ ఆంగ్లవార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.ఇస్రోపై రూపాయి పెట్టుబడి పెడితే అది రూ.2.54గా తిరిగి వస్తోందని సోమ్‌నాథ్ పేర్కొన్నారు. ఇది ఆర్థికంగా సమాజానికి కూడా లాభమని ఆయన అభివర్ణించారు.ఇటీవల ఫ్రాన్స్‌కు చెందిన నోవాస్పేస్ సంస్థ ఇటీవల భారత్‌లో ఇస్రో ఆర్థిక, సామాజిక ప్రభావం మిగతా 2లో..

# టీ ఫైబర్‌కు వడ్డీలేని రుణం ఇవ్వండి

**- రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్**
**- పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు ఇంటర్నెట్ సౌకర్యం**
**- రూ.1779 కోట్లు సమకూర్చండి**
**- తెలంగాణలో చౌకగా ఫైబర్ సేవలు**
**- కేంద్రమంత్రి సింధియాను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**





న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
టీ ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్ 3గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను ఆమోదించాలని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర టెలికం, కమ్యునికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో భేటీ అయ్యారు. ఆప్టికల్ ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు నెట్‌వర్క్ కల్పించడమే టీ ఫైబర్ లక్ష్యమని కేంద్ర మంత్రికి వివరించారు. 65,000 ప్రభుత్వ సంస్థలకు జీ2జీ, జీ2సీ సేవలు అందించడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల గృహాలకు, పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు నెలకు కేవలం రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందించడం టీ ఫైబర్ లక్ష్యమని చెప్పారు. టీ ఫైబర్ అమలుకుగానూ జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ (ఎన్ఎఫ్ఓఎన్) మొదటి దశ మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి త్వరగా అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఎఫ్ఓఎన్ మొదటి దశ నుంచి భారత్ నెట్ మూడో దశకు మార్చడానికి తెలంగాణ గవర్నమెంట్ పంపించిన డీపీఆర్‌ను ఆమోదించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న భారత్ నెట్ ఉద్యమి ప్రోత్సాహక పథకాన్ని టీ ఫైబర్ కు వర్తింపజేయాలన్నారు. అదే విధంగా.. టీ ఫైబర్ ఇంప్లిమెంట్‌కు రూ.1779 కోట్ల మేర వడ్డీ లేని దీర్ఘకాలిక రుణాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా జ్యోతిరాదిత్యా సింధియాకు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.



## పీసీసీ చీఫ్‌పై కసరత్తు

**- మంత్రివర్గ విస్తరణపైనా కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు**
**- ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**- మల్లికార్జున ఖర్గే, రాహుల్, కేసి వేణుగోపాల్‌తో భేటీ**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్‌తో తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. నూతన పీసీసీ ఎంపిక, క్యాబినెట్ విస్తరణ, వరంగల్లో సభ నిర్వహించే అంశాలపై రాహుల్ గాంధీతో నేతల చర్చించినట్లు తెలుస్తోంది. ఎస్సీ ,ఎస్టీ ,బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతల్లో ఒకరికి పీసీసీ పదవి దక్కే అవకాశం ఉంది. అలాగే క్యాబినెట్ విస్తరణలో పలు సామాజిక వర్గాలను తీసుకునే అంశంపైనా చర్చిస్తున్నట్లు సమాచారం. మిగతా 2లో..

## రుణమాఫీలో సమస్యలు పరిష్కరిస్తాం

**- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షస్తున్నారు**
**- అందుబాటులోకి ప్రత్యేకంగా మొబైల్ యాప్**
**- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
:రైతు రుణమాఫీ చేయడంలో క్షేత్రస్థాయిలో తలెత్తిన సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తుమ్మల వెల్లడించారు. ఈ మేరకు రుణమాఫీ పథకం-2024పై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ సమస్యలు పరిష్కరించే దిశగా చేపట్టిన చర్యలను మంత్రి తుమ్మల అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.2లక్షలలోపు కుటుంబ నిర్ధారణ లేని 4,24,873 ఖాతాదారుల సమాచారాన్ని సేకరించేందుకు వీలుగా కొత్త యాప్ తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయాధి కారులు స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లిగాని లేదా రైతు వేదికలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులు స్వీకరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వివరాలు తప్పుగా నమోదైన 1,44,545 ఖాతాలకు సంబంధించి ఇప్పటికే 41,322అకౌంట్లు సరి చేసినట్లు మంత్రి వెల్లడించారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న ఖాతాదారుల అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసే మొత్తాలను అన్నదాతలకు అందేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. రెన్యువల్ అయిన ఖాతాలకు సొమ్మును తిరిగి చెల్లించేలా, మాఫీ అయిన అకౌంట్లకు సంబంధించి తిరిగి కొత్త రుణాలు మంజూరు చేసే విధంగా బ్యాంకు అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల సూచించారు.

## ప్రాజెక్టుల నిర్మాణస్థలాన్ని పరిశీలించకుండానే అనుమతులు

**- కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన సీడీవో ఎస్ఈ ఫజల్..**
**- కీలక విషయాలు వెల్లడి**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
కాళేశ్వరం కమిషన్ ముందు నీటి పారుదల శాఖ సీడీవో ఎస్ఈ ఫజల్ విచారణకు హాజరయ్యారు. జస్టిస్ పీసీ ఘోష్ ఆయన్ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఫజల్ వెల్లడించారు. మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంలో సీకెంట్ ఫైల్‌కు వెళ్లాలని కాళేశ్వరం సీఈ చెప్పారన్నారు. సుందిళ్ల రెండో బ్లాక్-ఏలో అదనపు 6 వెంట్లు డిజైన్‌లో లేవని తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం మేరకు తర్వాత అదనపు వెంట్లు వేసినట్లు చెప్పారు. కాళేశ్వరం సీఈ నివేదిక మేరకు క్రాస్ సెక్షన్స్ ఆమోదించామన్నారు. ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండానే వాటిని ఆమోదించినట్లు చెప్పారు.మరోవైపు సీడీవో విశ్రాంత ఈఎన్సీ నరేందర్‌రెడ్డి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు రెండో రోజు విచారణకు హాజరయ్యారు. గురువారం నాటి విచారణకు కొనసాగింపుగా 2 లేఖలను కమిషన్‌కు అందజేశారు.

### పొలిట్రిక్స్

డీఎంకే తోవ్వలో శా
%బీఆరేస గొప్ప స్కెచ్,
ఫలించకపోతే సారూ
అవుతుంది తూచ్ !

సారు వారు గజీ-బిజీ
సరికొత్త ఎత్తుగడలు,
సంక్షేమం కోరకైతే
ఎందుకీ కసరత్తులు?

- న్యాలకంటి నారాయణ
9346200066

# ఉక్రెయిన్ లో మోడీకి ఘన స్వాగతం

**- పోలాండ్ నుంచి కీవ్ కు చేరుకున్న ప్రధాని**
**- మహాత్మాగాంధీ విగ్రహానికి తొలుత పుష్పాంజలి**
**- అ తరువాత జెలెన్ స్కీ తో భేటీ అయిన మోడీ**
**- యుద్ధ విరమణ మీదనే ఇరువురి చర్చలు**



కీవ్ (ప్రజా మంటలు):
ఉక్రెయిన్-రష్యా మధ్య నెలకొన్న వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాలు సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇందుకోసం అన్నివిధాలా సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. యుద్ధం కొనసాగుతోన్న వేళ ఉక్రెయిన్‌లో పర్యటించిన ప్రధాని మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అనేక విషయాలపై చర్చించినట్లు తెలిపింది. ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు భాగస్వామ్య పక్షాల మధ్య వాస్తవిక సంప్రదింపులు అవసరమని పునరుద్ఘాటించినట్లు పేర్కొంది.మోదీ ఉక్రెయిన్ పర్యటన చరిత్రాత్మకమన్న విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఇక్కడ సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొల్పేందుకు అన్ని విధాలుగా సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మోదీ స్పష్టం చేశారని అన్నారు. భేటీ సందర్భంగా సైనిక స్థితిగతులు, ఆహార, ఇంధన భద్రతతో పాటు శాంతిని నెలకొల్పే మార్గాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారని అన్నారు. మరోవైపు, గ్లోబల్ పీస్ సమ్మిట్‌లో తన భాగస్వామ్యాన్ని కొనసాగించాలని భారత్‌ను ఉక్రెయిన్ కోరినట్లు చెప్పారు."సమస్య పరిష్కారం కోసం ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకోవాల్సిన అవసరముందనే భారత్ అభిప్రాయమని" విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా సహకారం అందించుకునేందుకు ఇరువురు నేతలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడి పుతిన్‌తో జులైలో మోదీ జరిపిన చర్చల వివరాలను జెలెన్‌స్కీకి వివరించారని అన్నారు.


**భారత్-ఉక్రెయిన్ మధ్య 4 ఒప్పందాలు**

జెలెన్‌స్కీతో భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. వ్యవసాయం, ఆరోగ్యం, సంస్కృతి, మానవతా సాయం అంశాలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, ఆర్థిక అంశాలు, రక్షణ రంగం, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, విద్య అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారని, ఉక్రెయిన్‌లో యుద్ధానికి సంబంధించే ఎక్కువ మాట్లాడుకున్నట్లు తెలిపింది.

**స్మారక ప్రాంతం సందర్శన**

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భేటీలో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అమరుల స్మారక ప్రాంతానికి చేరుకున్న మోదీకి జెలెన్‌స్కీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మోదీని అలిగనం చేసుకొని అక్కడి నుంచి రష్య దాడిలో మరణించిన చిన్నారుల స్మారక ప్రాంతానికి తీసుకొళ్లారు. వెళ్లే సమయంలో జెలెన్‌స్కీ భుజంపై చేతులు వేసిన మోదీ ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అక్కడ మరణించిన చిన్నారులకు మోదీ నివాళులర్పించారు.ఆ తర్వాత రష్యా దాడితో దెబ్బతిన్న ఉక్రెయిన్‌లో ఎలాంటి పరిణామలు చోటు చేసుకున్నాయి. ఎంత మేరకు చిన్నాభిన్నామైందో తెలుపుతూ స్థానిక మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించారు. కాగా, రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కార మార్గాలపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. అంతకుముందు మిగతా 2లో..

## ప్రజా నాడి




# నా ఫామ్‌హౌజ్ అక్రమమైతే కూల్చేయండి


**- అధికారులకు బదులు మీరే వెళ్లి నిర్ధారణ చేసుకోండి**
**- కేటీఆర్, హరీశ్‌రావుకు సవాల్ మంత్రి పొంగులేటి సవాల్**
**- రుణమాఫీపై భారాసది అనవసర రాద్ధాంతం**
**- కావాలనే రైతులను రెచ్చగొడుతున్నారు**
**- బీఆర్ఎస్ ప్రభుత్వంలా అప్పులు చేసి పెట్టడం లేదు**
**- కేసీఆర్ ప్రభుత్వంలా మోసం చేయట్లేదని వెల్లడి**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.7 లక్షల కోట్లు అప్పులు ఉన్నప్పటికీ హామీలు అమలు చేశామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటికి రాష్ట్రం రూ.7.19 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పి కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. మేం ఇతర ఖర్చులన్నీ తగ్గించుకొని ప్రజలకు రుణమాఫీ చేశాం. ఇప్పటికే 22 లక్షలమంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణలు మాఫీ చేశాం. దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా రుణమాఫీ చేశాం. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమయ్యాయి. మిగిలిన రైతుల ఖాతాల్లో మరో రూ.12 వేల కోట్లు త్వరలోనే వేస్తాం. గత కేసీఆర్ ప్రభుత్వంలా మేం మోసం చేయట్లేదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను రెండుసార్లు మోసం చేసింది. రూ.లక్ష రుణమాఫీ విడతల వారీగా చేస్తామని చెప్పి ఐదేళ్లలో కూడా చేయకుండా.. ఎన్నికల ముందు కొందరికే రుణమాఫీ చేశారు. చేసిన మంచి పనిని కూడా మేం ప్రచారం చేసుకోలేదు. గత ప్రభుత్వంలా ప్రచారం కోసం రూ.వేల కోట్లు వృథా చేయడం లేదని అన్నారు. ఉచిత విద్యుత్ కోసం రూ.42 లక్షల దరఖాస్తులు మాత్రమే సరిగా ఉన్నట్లు గుర్తించాం. తప్పులు సవరించి మరో 7 లక్షల మందికిపైగా ఉచిత విద్యుత్ వర్తింప చేస్తున్నాం. ఉచిత కరెంట్, గ్యాస్ రాయితీ లబ్ధిదారుల మిగతా 2లో..







## 40మంది భారతీయ పర్యాటకులు జలసమాధి

**- నేపాల్‌లో ఘోరప్రమాదం - నదిలోకి దూసుకెళ్లిన బస్సు**

**ఖాట్మండ్** (ప్రజా మంటలు): నేపాల్‌లో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారత పర్యటకులు ప్రయాణిస్తున్న ఓ బస్సు నదిలోకి దూసుకెళ్లింది. తనాహున్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. వీరంతా భారతీయులే. వీరిలో 14 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నంబరు ప్లేట్‌తో ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు శుక్రవారం ఉదయం నేపాల్ లోని పొఖారా నుంచి కాఠ్‌మాండూ వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కొండల ప్రాంతంలో అదుపు తప్పి మర్స్యాంగ్డి నదిలో పడిపోయింది. ఈ సమాచారమందుకున్న ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల్లో ఇప్పటివరకు 16 మందిని కాపాడగా.. మరో 14 మంది మృతదేహాలను గుర్తించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ రిలీఫ్ కమిషనర్ స్పందించారు. స్థానిక అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జూన్‌లోనూ నేపాల్ లో ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో రెండు బస్సులు నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో ఏడుగురు భారతీయులు సహా 60 మందికి పైగా ప్రయాణికులు గల్లంతయ్యారు.

మొదటి పేజీ తరువాయి

## నా ఫామ్‌హౌజ్ అక్రమమైతే కూల్చేయండి

సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. దరఖాస్తుల్లో తప్పులు సవరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. వ్యవసాయ రుణం రూ.2 లక్షలకు పైగా ఉన్నవారి ఖాతాల్లో నిధులు వేయలేదు. రూ.2 లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించాలని రైతులకు సూచించాం. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని మేం పదే పదే చెప్పాం. దానిని దృష్టిలో ఉంచుకొని భారాస నాయకులు విమర్శలు చేస్తున్నారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి.. కొత్త ఆర్వోఆర్ తీసుకొస్తున్నాం. తెలంగాణ ఆర్వోఆర్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. హైడ్రాను మంచి ఉద్దేశంతోనే తెచ్చాం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని నిర్మాణాలకు అనుమతించేది లేదు. అలాంటి కట్టడాలను కూల్చివేస్తున్నాం. అవన్నీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్మాణాలు. హిమయత్ సాగర్ ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నా ఫామ్‌హౌజ్ ఉందని భారాస మీడియా బురద జల్లుతోంది. కేటీఆర్, హరీశ్‌రావుకు సవాల్ చేస్తున్నా.. నా ఇల్లు అక్రమంగా ఉంటే.. వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశిస్తున్నా. మా అధికారులకు బదులు మీరే వెళ్లి కొలవండి. అక్రమం అని తేలితే.. కూల్చేయండని పొంగులేటి అన్నారు.

## లాభాల ఇస్రో

అనే అంశంపై రిపోర్టును ప్రచురించింది. ఈ పరిశోధనను ఇస్రోనే చేయించి ప్రభుత్వానికి సమర్పించింది. దీనిని నేషనల్ స్పేస్ డే సందర్భంగా విడుదల చేశారు. దీని అంచనాల ప్రకారం గత పదేళ్లలో భారత అంతరిక్ష సంస్థ 60 బిలియన్ ఆర్థిక ప్రయోజనాలు, 47లక్షల ఉద్యోగాలను సృష్టించినట్లు పేర్కొంది. దీంతోపాటు 24 బిలియన్ డాలర్లు విలువైన పన్ను ఆదాయం తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఈ రిపోర్టులో దేశంలోని మారుమూల ప్రాంతాలు, అసంఘటిత రంగాల్లో ఇస్రో ప్రభావాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయలేదు.రానున్న పదేళ్లలో పరిస్థితులను బట్టి ఈ సంస్థ భారత ఆర్థిక వ్యవస్థకు 89 బిలియన్ డాలర్ల నుంచి 131 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చవచ్చని అంచనా వేసింది. భారతీయుల రోజువారీ జీవితాల్లో ఉపగ్రహ ఆధారిత అప్‌డేట్లు కూడా కీలక భాగమయ్యాయని ఈ నివేదిక పేర్కొంది.నోవాస్పేస్ ప్రధాన నిపుణుడు స్టీవ్ బౌచర్ మాట్లాడుతూ.. గత 55 ఏళ్లలో ఇస్రోపై ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం సొమ్ము.. అమెరికాకు చెందిన నాసా ఏడాది బడ్జెట్ కంటే తక్కువేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్రో వార్షిక బడ్జెట్ 1.6 బిలియన్ డాలర్లు. నాసా బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. అంటే దాదాపు 15.5 రెట్లు అధికం.2023 డిసెంబర్ 31 నాటికి ఇస్రో 127 భారతీయ ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటిల్లో ప్రైవేటువి, విద్యాసంస్థలవి కూడా ఉన్నాయి. మూడు డీప్ స్పేస్ మిషన్లకు కూడా ఇస్రో వేదికైంది. వీటిల్లో 50 ఉపగ్రహాల విలువ రూ.50,000 కోట్లు పైమాటే. ఇవి వాతావరణం, తుఫాన్లపై నిఘా, ఏటీఎంలు, పంటల దిగుబడి అంచనాలు, స్మార్ట్ సిటీ ప్లానింగ్ వంటి రంగాల్లో పని చేశాయి. రోజువారీ 8 లక్ష మంది మత్స్యకారులకు ఉపగ్రహ సమాచారం ఉపయోగపడుతోంది. ఇక మొత్తం 97 రాకెట్లు సాయంతో 432 విదేశీ ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి చేర్చింది.

## పీసీసీ చీఫ్‌పై కసరత్తు

ఈ నెలలోనే వరంగలలో సభ పెట్టే యోచనలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సభకు రాహుల్ గాంధీ రావాలని నేతలు కోరనున్నారు. సీఎం దక్షిణ తెలంగాణకి చెందిన వ్యక్తి కావడంతో ఉత్తర తెలంగాణ నేతకి పీసీసీ చీఫ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని సమాచారం. సీఎం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలకే పీసీసీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల నుంచి ఒక్కో పేరుతో షార్ట్ లిస్ట్ సిద్ధం చేసినట్టు సమాచారం. ఎస్సీ సామాజికవర్గం నుంచి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్.. ఎస్టీ సామాజిక వర్గం నుంచి బలరాం నాయక్.. బీసీ సామాజిక వర్గం నుంచి మధు యాష్కీ పీసీసీ చీఫ్ రేసులోకి వచ్చారు. మరి వీరిలో ఎవరికి పదవి దక్కుతుందో చూడాలి. దాదాపుగా నేడు అధిష్టానం ఖరారు చేస్తుందని అంతా భావిస్తున్నారు.అలాగే కేబినెట్ విస్తరణపై కూడా అధిష్టానంతో చర్చిస్తున్న నేపథ్యంలో... తాజాగా మంత్రి మండలిలోకి మరో నలుగురిని తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రి పదవులను ఆశిస్తున్న వారి జాబితా అయితే చాలా పెద్దగానే ఉంది. మంత్రి పదవులను ఆశిస్తున్న వారిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, శ్రీహరి ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలునాయక్, రామచంద్రనాయక్ తదితరులున్నారు. కొత్తగా కోదండరామ్ ఎమ్మెల్సీ కావడంతో ఆయనకు కూడా అవకాశం ఉందని అంటున్నారు.

## ఉక్రెయిన్‌లో మోడీకి ఘన స్వాగతం

రెండు రోజుల పోలెండ్ పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ.. అక్కడి నుంచి 10 గంటల పాటు రైల్‌ఫోర్స్ వన్ రైలులో ప్రయాణించి ఉక్రెయిన్ చేరుకున్నారు. రష్యా- ఉక్రెయిన్.. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న దేశాలు. అలాంటి దేశాల మధ్య యుద్ధం ఆపే దిశగా ప్రధాని మోదీ శాంతిమంత్రమెయ్యాలని చూస్తున్నారు. అందుకే రష్యాలో పర్యటించిన ఆరు వారాల తర్వాత ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్నారు. 22వ ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశానికి పుతిన్ ఆహ్వానంతో ఈ ఏడాది జులై 8న మాస్కోలో పర్యటించారు ప్రధాని మోదీ. ఈ సందర్భంగా పుతిన్‌ను మోదీ ఆత్మీయంగా అలింగనం చేసుకోవడం, వారిరువురూ ఆప్యాయంగా మాట్లాడుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో మోదీ రష్యా వైపు ఉన్నారన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. మోదీ రష్యా పర్యటించిన రోజే కీవ్‌లోని ఓ ఆస్పత్రిలో దాడి జరిగింది. రష్యా జరిపిన దాడిలో 37 మంది చిన్నారులు మృతి చెందారు. వారి మరణంపై ఆగ్రహం వ్యక్తం చేసిన జెలెన్‌స్కీ మోదీపై విమర్శలు గుప్పించారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య నాయకుడు అక్కడికి వెళ్లి ప్రపంచంలోని అతిపెద్ద క్రిమినల్‌ను కౌగిలించుకోవడం చాలా బాధకరం అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ సమస్యను పరిష్కరించుకోవాలంటే ఘర్షణకు దిగకుండా.. చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని మొదటి నుంచి రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సఖ్యత కోరుకుంటున్న మోదీ.. తాజా ఉక్రెయిన్‌లో పర్యటించడంపై ప్రపంచ దేశాలు తాజాగా పరిణామాల్ని ఆసక్తికరంగా గమనిస్తున్నాయి. ÷లెన్స్కీతో ప్రధాని మోదీ రెండో సారి భేటీ అయ్యారు. తొలిసారి ఈ ఏడాది ఇటలీలోని అపులియాలో జరిగిన జీ7 శిఖరాగ్ర సందర్భంగా జెలెన్‌స్కీని కలిశారు. ఆ సమావేశంలో ఉక్రెయిన్-రష్యా మధ్య నెలకొన్న సమస్యల్ని పరిష్కరించేందుకు భారత్ తన శక్తిమేర ప్రయత్నిస్తోందని, చర్చలు-దౌత్యం ద్వారా శాంతికి మార్గం ఉంటుందని ఉక్రెయిన్ అధ్యక్షుడికి ఆయన తెలిపారు. ఉక్రెయిన్‌లో వివాదానికి పరిష్కారం కనుగొనడంలో భారత్ చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

# అనిల్ అంబానీపై సెబీ వేటు

### - రూ.25 కోట్ల జరిమానా - మరో 24 సంస్థలపైనా నిషేధం




ముంబై (ప్రజా మంటలు): ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై మార్కెట్ల నియంత్రణా సంస్థ సెబీ.. సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి ఐదేళ్ల పాటు నిషేధం విధించింది. 'రిలయన్స్ హోమ్ ఫైనాన్స్' లో కీలకంగా వ్యవహరించిన మాజీ అధికారులు, మరో 24 సంస్థలకూ నిషేధాన్ని వర్తింపజేస్తున్నట్లు శుక్రవారం వెల్లడించింది. నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.అనిల్ అంబానీపై సెబీ రూ.25 కోట్ల జరిమానా కూడా విధించింది. సెక్యూరిటీ మార్కెట్లతో సంబంధం ఉండే ఎలాంటి కార్యకలాపాల్లోనూ పాల్గొనొద్దని ఆంక్షలు విధించింది. ఏ నమోదిత కంపెనీ, సెబీలో రిజిస్టర్ అయిన మధ్యవర్తిత్వ సంస్థల్లో డైరెక్టర్ సహా ఎలాంటి కీలక పదవుల్లో ఉండొద్దని ఆదేశించింది. మరోవైపు రిలయన్స్ హోమ్స్ ÷నాన్స్‌ను సైతం సెక్యూరిటీ మార్కెట్ల నుంచి ఆర్నెళ్ల పాటు నిషేధించింది. రూ.6 లక్షల జరిమానా కూడా విధించింది. అనిల్ అంబానీ తన అనుబంధ సంస్థలకు రుణాల రూపంలో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నిధులను మళ్లించారని సెబీ తమ నివేదికలో ఆరోపించింది. అందుకోసం కంపెనీకి చెందిన కీలక నిర్వహణాధికారులతో కలిసి కుట్ర పన్నారని పేర్కొంది. ఆర్‌ఎఫ్‌హెచ్‌ఎల్ డైరెక్టర్ల బోర్డు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ.. వాటిని యాజమాన్యం బేఖాతరు చేసినట్లు తెలిపింది. అనిల్ ప్రభావంతో కీలక అధికారులు కావాలనే నిబంధనలను అతిక్రమించారని ఆరోపించింది. ఇతర సంస్థలు నిధుల గ్రహీతలుగా లేదా మళ్లింపునకు మధ్యవర్తిగా వ్యవహరించాయని సెబీ తెలిపింది. ఈ రుణాలు పొందిన చాలా కంపెనీలు తిరిగి చెల్లించటంలో విఫలమయ్యాయని వివరించింది. ఫలితంగా ఆర్‌ఎఫ్‌హెచ్‌ఎల్ దివాలా తీసి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పరిష్కార ప్రణాళికకు వెళ్లాల్సివచ్చిందని పేర్కొంది. తద్వారా పబ్లిక్ షేర్‌హోల్డర్ల పరిస్థితి దుర్భరంగా మారిందని వివరించింది. ఉదాహరణకు 2018లో కంపెనీ షేరు ధర రూ.59.60 వద్ద ఉందని తెలిపింది. 2020 నాటికి కంపెనీ మోసం బయటకు రావడం, నిధులు అడుగంటిపోవటంతో షేరు విలువ రూ.0.75కు పడిపోయినట్లు గుర్తుచేసింది. ఇప్పటికీ తొమ్మిది లక్షల మంది వాటాదారులు నష్టాలతో కొనసాగుతున్నారని వివరించింది. అనిల్ అంబానీతో పాటు మరికొందరు కీలక అధికారులపైనా సెబీ భారీ జరిమానా విధించింది. మరికొన్ని సంస్థలపై రూ.25 కోట్ల అపరాధ రుసుము చెల్లింపునకు ఆదేశించింది. అక్రమంగా రుణాలు పొందడం లేదా రుణాలు జారీ అయ్యేందుకు సహకరించినందుకుగానూ వాటిపై చర్యలు తీసుకుంది. 2022లోనూ సెబీ వీరందరిపై నిషేధం విధించడం గమనార్హం.

# మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి ఊరట

### ఇవిఎం ధ్వంసం కేసులో హైకోర్టులో బెయిల్




అమరావతి,ఆగస్ట్23((ప్రజా మంటలు): మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి భారీ ఊరట లభించింది. ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసులో ఆయనకు ఏపీ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం పలు షరతులు విధించింది. రూ.50 వేలు విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని.. పాస్ పోర్ట్ అప్పగించాలని తెలిపింది. అలాగే, ప్రతీ వారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎదుట సంతకం చేయాలని ఆదేశించింది. కాగా, సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజున పాల్వాయిగేట్ సమీపంలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన కేసుతో పాటు, పోలీసులపై దాడి కేసులో ఆయన అరెస్టై.. ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్నారు. జూన్ 26 నుంచి ఆయన జైల్లోనే ఉన్నారు. అయితే, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. అనంతరం ఎట్టకేలకు పిన్నెల్లికి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నెల్లూరులోని కేంద్ర కారాగారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

# డెమక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలాహ్యారిస్

### - నామినేషన్ స్వీకరించిన ఉపాధ్యక్షురాలు

చికాగో,ఆగస్ట్23 (ప్రజా మంటలు): డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ నామినేషన్ స్వీకరించారు. చికాగోలో జరిగిన డీఎన్సీ మీటింగ్‌లో ఆమె నామినేషన్ ఆమోదించారు. డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ స్వీకరించిన రెండో మహిళగా కమలా హ్యారిస్ నిలిచారు. కన్వెన్షన్‌లో హ్యారిస్ మాట్లాడుతూ తన తల్లి శ్యామలా గోపాలన్‌ను గుర్తు చేసుకున్నారు. ప్రతి రోజూ తన తల్లిని మిస్ అవుతున్నట్లు ఆమె చెప్పారు. గత కొన్నాళ్లుగా తాను వెళ్తున్న దారి అసాధారణ మైందన్నారు. కానీ ఇలాంటి జర్నీలు కొత్తేమీ కాదన్నారు. తన తల్లి పైనుంచి చూస్తుంటుందని, ఆమె సంతోషంతో దీవిస్తుందని ఆశిస్తున్నట్లు హ్యారిస్ తెలిపారు. 19 ఏళ్ల వయసులో తన తల్లి దేశం దాటి వచ్చినట్లు గుర్తు చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ సైంటిస్టుగా కెరీర్ కోసం తన తల్లి ఇండియా నుంచి కాలిఫోర్నియా వచ్చినట్లు కమలా హ్యారిస్ వెల్లడించారు. తన తల్లే తనను పెంచినట్లు ఆమె చెప్పారు. స్వంత ఇల్లు కొనడానికి ముందు ఈస్ట్ బేలో ఓ చిన్న అపార్ట్‌మెంట్‌లో కిరాయికి ఉండేవాళ్లమని తెలిపారు. ఫ్లాట్‌ల్యాండ్స్ వద్ద ఉన్న తమ ఇంటి చుట్టూ ఫైటెర్లు, నర్సులు, కన్‌స్ట్రక్షన్ వర్కర్లు కలగొలుపుగా ఉండేవారన్నారు. 19 ఏళ్ల వయసులో శ్యామలా గోపాలన్.. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు.

# రైతులను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్

- తెలంగాణను అప్పుకుప్ప చేసిన గత ప్రభుత్వం
- అక్రమ కట్టడాలకు గత ప్రభుత్వానిదే బాధ్యత
- ఎమ్మెల్సీ కోదండరాం ఘాటు విమర్శలు



హైదరాబాద్ (ప్రజా మంటలు):రైతులను కొందరు రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో కోదండరాం మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త ప్రభుత్వానికి చిప్ప చేతిలో పెట్టి పోయిందని విమర్శించారు. రుణమాఫీ చాలామందికి అయిందని... కొన్ని టెక్నికల్ ఇబ్బందులతో కొందరికి రుణమాఫీ కాలేదని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న కట్టడాలకు గత ప్రభుత్వం పర్మిషన్ ఎందుకు ఇచ్చారంటే బీఆర్ఎస్ నాయకుల వద్ద సమాధానం లేదని అన్నారు. హైడ్రా విషయంలో తమకి మినహాయింపు ఇవ్వమని బీఆర్ఎస్ నేతలు కోరడం విచిత్రంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం చెరువులను నాశనం చేసిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించలేదని అన్నారు. తనకు ఎమ్మెల్సీ రావడం ఉద్యమకారులకు ఇచ్చిన గుర్తింపుగా చూస్తున్నారని మండిపడ్డారు. రాజీవ్ గాంధీ ఒక పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని చెప్పారు. రాజీవ్ విగ్రహం విషయంలో కత్తులు దుయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదు? అని ప్రశ్నించారు. తెలంగాణ మేధావులు, ఉద్యమకారులు అని బయటకి వచ్చేవాళ్లు నిష్పక్షపాతంగా ఉండాలని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం పెడుతామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. తాత్సారం చేయకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయడం మంచి నిర్ణయమని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేస్తే అభ్యతరం ఉండదన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే అభ్యంతరమా? అని అన్నారు. తెలంగాణలోనే రైతులకు ఇచ్చే రుణాలు తక్కువే అని చెప్పారు. జనాలకి దూరం అవుతానని సెక్యూరిటీ వద్దు అన్నానని కోదండరాం వెల్లడించారు.తనను లోక్ సభకు పోటీ చేయమని కేసీఆర్ అడిగారు. తాను నో చెప్పానని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి సహకరిస్తామని కేసీఆర్‌కి చెప్పానని, ఆయన పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేదని అన్నారు.

## జోగి తనయుడు రాజీవ్‌కు బెయిల్ మంజూరు

విజయవాడ,ఆగస్ట్23 (ప్రజా మంటలు): అగ్రి గోల్డ్ భూముల కొనుగోలు కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం రాజీవ్ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేశ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. పిటిషన్‌పై సెప్టెంబరు 3న తీర్పు వెలువరిస్తామని ధర్మాసనం తెలిపింది. చంద్రబాబు ఇంటిపై దాడికి సంబంధించి తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఆయన ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇదే కేసులో జోగి రమేశ్ రెండు సార్లు పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఏమీ తెలియదు, గుర్తులేదని సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారని, మరో సారి విచారణకు పిలిచే అవకాశమున్నట్టు సమాచారం.

# కోల్‌కతా హత్యాచార నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ





కోల్‌కతా,ఆగస్ట్23 (ప్రజా మంటలు): వైద్య విద్యార్థినిపై హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కు కోల్‌కతాలో ప్రత్యేక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సీబీఐ కస్టడీ ముగియడంతో అధికారులు నిందితుడిని భారీ భద్రత మధ్య సీల్దా సివిల్ అండ్ క్రిమినల్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం సంజయ్‌రాయ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో.. పోలీసులు అతడిని జైలుకు తరలించనున్నారు. అలాగే, సంజయ్ రాయ్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరుచేసింది.పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ఇటీవల వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాం÷-రతికి గురిచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెపై జరిగిన ఈ దారుణం, ఆస్పత్రిపై దాడి ఘటనల నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వం తీరుపైనా విమర్శలు వచ్చాయి. మరోవైపు, ఈ దారుణం జరిగిన రోజు డ్యూటీలో ఉన్న ఆర్జీ కర్ ఆస్పత్రి, వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తోపాటు మరో నలుగురు వైద్యులను సీబీఐ విచారించింది. ఈ విచారణలో సందీప్ ఘోష్ పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయనకు లై-డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు సీబీఐకి కోర్టు అనుమతి మంజూరు చేసింది.

**అనుమానాలు రేకెత్తిస్తున్న తలుపు గొళ్లెం**

కోల్‌కతా: యావత్ దేశాన్ని(గ్భ్యాం)తికి గురి చేసిన కోల్‌కతా వైద్య విద్యార్థిని కేసులో విచారణ చేస్తోన్న సీబీఐ పలు కీలక అంశాలు వెల్లడించింది. సెమినార్ హాల్ డోర్ బోల్ట్ పని చేయడం లేదని తమ విచారణలో బయటపడినట్లు పేర్కొంది.బాధితురాలిని చిత్రహింసలు పెడుతున్న సమయంలో సెమినార్ హాల్ లోపల నుంచి వచ్చిన శబ్దాలు ఎవ్వరికీ వినిపించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది.'సెమినార్ హాల్ డోర్ బోల్ట్ విరిగిపోయింది. నేరం జరుగుతుండగా ఎవరూ లోనికి రాకుండా ఉండేందుకు హాల్ బయట నిల్చొని ఎవరైనా సహకరించారా' అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు సీబీఐ వెల్లడించింది. ఈ విషయాన్ని నిర్ధరించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. బాధితురాలిని చిత్రహింసలు పెడుతున్న సమయంలో సెమినార్ హాల్ లోపల నుంచి వచ్చిన శబ్దాలు ఎవ్వరికీ వినిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని తెలిపింది.గొళ్లెం పనిచేయకపోవడం గురించి ఇంటర్న్‌లు, జూనియర్ డాక్టర్ సిబ్బంది తమ విచారణలో బయటపెట్టినట్లు సీబీఐ వెల్లడించింది. దీంతో బోల్ట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఆగస్టు 9న తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య హాల్‌లోకి ప్రవేశించిందని డ్యూటీలో ఉన్న వైద్యుడు చెప్పినట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించి మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను శుక్రవారం సీబీఐ ప్రశ్నించింది. మరోవైపు కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కు కోల్‌కతాలో ప్రత్యేక న్యాయస్థానం 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.ఆర్జీ కర్ ప్రిన్సిపల్‌పై అవినీతి ఆరోపణల కేసు సీబీఐకి బదిలీకోల్‌కతాలో ఆర్జీ కర్ వైద కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసును ప్రత్యేక సిట్ బృందం దర్యాప్తు చేస్తోంది.తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కలకత్తా హైకోర్టు సిట్‌ని ఆదేశించింది. సీసీటీవీ ఫుటేజీలు, కేసు డైరీతో సహా అన్ని వివరాలను శనివారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందించాలని హైకోర్టు పేర్కొంది.కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అయితే ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉన్న సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. ఆయన పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలకు పాల్పడ్డారని మీడియా కథనాలు వెలువడ్డాయి. అనాథ శవాలను అమ్ముకోవడం, వాడేసిన సిరంజులు, ఇతర సామాగ్రిని రీసైక్లింగ్ చేసి సొమ్ము చేసుకొనేవారని ఇటీవల ఓ అధికారి పేర్కొన్నారు.ఇక, ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న సందీప్ ఘోష్‌ను సీబీఐ విచారిస్తోంది. ఈ విచారణ సమయంలో పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. ఆయనకు లై- డిటెక్టర్ పరీక్ష నిర్వహించాలని సీబీఐ నిర్ణయించింది. ఇందుకు న్యాయస్థానం సైతం అనుమతినిచ్చింది. దీంతో త్వరలోనే మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తో పాటు మరో నలుగురిపై సీబీఐ పాలీగ్రాఫ్ టెస్ట్ నిర్వహించనుంది.

# బిజెపిలో ఎదగలేకపోతున్న కొత్త తరం

## మోడీ ద్వయం గుప్పిట్లో పార్టీ యత్రాంగం



న్యూఢిల్లీ,ఆగస్ట్23 (ప్రజా మంటలు): భారతీయ జనతాపార్టీ ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంటోంది. నవతరం ముందుకు రావడంతో సిద్దాంతపరమైన నిబద్ధతలకు అవకాశం లేని కొత్త తరం దూసుకు వస్తోంది. దీనికితోడు గత దశాబ్దకాలంగా మోడీకి తిరుగులేదన్నట్లుగా పార్టీని గుప్పిట పెట్టుకున్నారు. దీంతో ఇప్పుడు మోడీ తరవాత ఎవరంటే... సమాధానం లేదు. అధికారమే పరమావధిగా ఇందులోని నేతలు ఆరాట పడుతున్నారు. గత పదేదేళ్లుగా పాదం మోపిన మోడీ ద్వయం ఇక పార్టీలో తమకు తిరుగులేని విధంగా చేసుకున్నారు. విధాన నిర్ణయాలన్నీ ఇప్పుడు కేవలం మోడీ ద్వంయం కనుసన్నల్లోనే సాగుతున్నాయి. వారిని కాదని ఏ ఒక్క నిర్ణయం కూడా జరగడం లేదు. గడ్కరీ లాంటి సీనియర్ నేతల మాటలకు కూడా విలువ లేదని మొన్న పార్లమెంట్ సమావేశాల చర్చ సందర్భంగా తేలిపోయింది. ఆయన సూచించిన బీమా పథకాల జిఎస్టీని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిర్ద్వందగా తోసిపుచ్చారు. ఇకపోతే అంతేగాకుండా పాతతరం నేతలకు మెల్లగా ఉద్వాసన పలికారు. ఇందులో భాగంగా వాజ్‌పేయ్, అద్వానీ నాటి నేతలను గౌరవంగా పక్కకు తప్పించారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్వానీ వృద్ధాప్యం కారణంగా ఇంటికే పరిమితం అయ్యారు. ఆయనకు కనీసం రాష్ట్రపతి పదవి కూడా కట్టబెట్టకుండా కక్ష తీర్చుకున్నారు. అలాగే మురళీమనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ లాంటి వారు దూరంగా ఉన్నారు. సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ లాంటి వారు గతించారు. ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేయడంతో వెంకయ్య నాయుడు ఇక పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనలేకుండా చేశారు. ఇక మిగిలిందల్లా..రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే. ఇప్పటికే శతృఘ్ను సిన్హా, యశ్వంత్ సిన్హాలు బయటకు పోయారు. అరుణ్ శౌరి లాంటి వారు అడ్రస్ లేదు. మధ్యప్రదేశ్ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కూడా మధ్యప్రదేశ్నుంచి కేంద్రంలోకి రప్పించారు. ఈ క్రమంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు ఈ దఫా వరకు మంత్రులుగా కొనసాగుతారు. తరవాత వీరు కూడా పార్టీకి దూరం కావడం ఖాయమని గుర్తించాలి. ఇప్పటికే పార్టీలో వీరికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఈ క్రమంలో పార్టీ పునర్వ్యవస్తీకరణ తీరు చూస్తే మనకు వారి వ్యూహం అర్థం కాగలదు. అనేక సంవత్సరాల పాటు ఏర్పడిన వరుస ఖాళీలను భర్తీ చేయకుండా, అత్యున్నత స్థాయి పార్టీ వేదికలను పునర్వ్యవస్థీ కరించింది. పార్లమెంటరీ బోర్డులోనూ, కేంద్ర ఎన్నికల కమిటీలోనూ కొన్ని కొత్త మొఖాలు చేరాయి. అతిరథమహారథులు అనుకున్నవారంతా పక్కకుపోయారు. ఆరెస్సెస్‌కు వీరవిధేయుడైన నితిన్ గడ్కరీని తొలగించడం ఇప్పటికైతే జరక్కపోవచ్చు. ఆయనకు స్వతంత్రంగా పనిచేసుకొనే మంత్రి అనీ, సమర్థుడనీ విపక్షాల్లో సైతం మంచిపేరున్నది. రాష్ట్రస్థాయిని దాటి వేగంగా జాతీయస్థాయికి ఎదిగిపోతున్న యోగి ఆదిత్యనాథ్‌కు అడ్డుకట్టవేయాలంటే మరో ఠాకూర్ నాయకుడు ఉండాల్సిందే కదా అని కొందరు అంటున్నారు. పార్టీలోని మిగతావారంతా మోదీ, అమిత్ షా తరువాతేనని స్పష్టం చేయదల్చుకున్నారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ రాజకీయ ప్రయోజనాలను నిలబెట్టు కుంటూనే పార్టీలో తమ పట్టును మోడీ, అమిత్ షాలు నిలుపుకున్నారు. మధ్యప్రదేశ్ చౌహాన్‌ను వదిలేయడం వెనుక పార్టీకి కొత్తరక్తం అవసరం కంటే, పాతతరాన్ని వదిలించుకొనే లక్ష్యం కనిపిస్తోంది. యూపీ యోగిని ప్రమోట్ చేయకుండా పార్టీ పెద్దలిద్దరూ వదిలేస్తారని ఎవరూ అనుకోలేదు. ఇప్పుడు యోగి విజయంతోనే, రేపు మోదీ అంటూ మొన్నటి యూపీ ఎన్నికల్లో అమిత్ షా బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. మోదీ తరువాత ఆయనే అని అంతా అనుకుంటున్న తరుణంలో పార్టీ అధినాయకత్వం ఈ చర్యద్వారా ఆయనకూ, ప్రజలకూ స్పష్టమైన సందేశం ఇవ్వదల్చుకున్నట్టుంది. ఈశాన్యం నుంచి శర్బానంద్ సోనోవాల్ ఎంపిక వెనుక కూడా రాజకీయాలు ఉన్నాయి. సోనోవాల్‌కు స్థానం కల్పించడమంటే అసోం సిఎం శర్మను హద్దుల్లో ఉంచడం కోసమే అని అర్థం చేసుకోవాలి. పార్టీలో తమ ఆధిపత్యంతో సాగేలా చర్యలు తీసుకున్నారు. కొందరు కొత్తతరం నేతలకు అవకాశాలు ఇచ్చారు. తెలంగాణ నుంచి లక్ష్మణ్‌కు అవకాశం ఇవ్వడం ఇందులో భాగమే. ఇకముందు అనేక రకాల మార్పులు చోటుచేసుకోగలవు.

# ప్రత్యేక హోదాపై పట్టుదల ఏదీ

### కేంద్రాన్ని నిలదీయలేకపోయిన పార్టీలు

### విభజనతో జరిగిన నష్టాన్ని ఎలా పూడుస్తారు

న్యూఢిల్లీ,ఆగస్ట్23 (ప్రజా మంటలు): పార్లమెంట్ సాక్షిగా హామీయిచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే.. ఈ పాటికే చాలా మార్పులను చూసి ఉండేవాళ్లం. లక్షల ఉద్యోగాలు వచ్చి ఉండేవి. ఈ తొమ్మిదేళ్లలో ఎన్నో పరిశ్రమలు, హోటళ్లు, ఆస్పత్రులు కట్టేవాళ్లు, చదువుకునే యువతకు భరోసా వచ్చేది... కానీ అధికారంలో ఉన్నవారు మోసం చేయడంతో ఆ పరిస్థితిని మనం చూడలేక పోతున్నామని సిపిఎం నేత గఫూర్ అభిప్రాయపడ్డారు. కడప ఉక్కు కోసంఎంతగానో పోరాడినా దానిని సాధించకుండానే పోయామని అన్నారు. గతంలో ఎన్నో పోరాటాలు చేసినా కలసి రాకపోవడం, అధికార పార్టీ కలవక పోవడం వల్ల కేంద్రం అలుసుగా తీసుకుందన్నారు. విభజనతో జరిగిన నష్టాన్ని ప్రత్యేక హోదాతో మాత్రమే పూడ్చ గలమని డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్ని అన్నారు. ఇకపోతే ప్రత్యేక హోదాకోసం యువత కలిసి రావాలని, నిరంతరాయంగా ప్రత్యేక హోదా వచ్చేవరకు పోరాటాలు కొనసాగించాలన్నారు. విభజనతో జరిగిన నష్టాన్ని ప్రత్యేక హోదా మాత్రమే పూడ్చగలదు. అందుకే మన హక్కును సాధించుకోవడానికి నిరంతరాయంగా, ఐక్యంగా పోరాడుదామని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అందరం కలిసికట్టుగా పోరాడం. ప్రత్యేక హోదా కోసం ఇక్కడికొస్తే కేసులు పెడతామని విద్యార్థులను బెదిరించారు. చట్టసభలైన పార్లమెంట్, అసెంబ్లీల్లోనూ ప్రత్యేక హోదా అంశంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు గట్టిగా పోరాటం చేశారు. ఇవన్నీ చేసినా పాలకులు హోదా ఇచ్చారా?..అంటే లేదని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాగుడు మూతలు ఆడుతున్నాయి. ఇన్నేళ్లయినా నిర్ణయం తీసుకుండా నాన్చివేత ధోరణినే మరోమారు అవలంబించారు. ఇనుప ఖనిజం నిల్వలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని కేంద్ర ఉక్కు శాఖ గతంలో పేర్కొంది. మైనింగ్ లీజు, అందుబాటులో ఉన్న ఇనుప ఖనిజం వివరాలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకోవాలని మెకాన్ సంస్థను ఆదేశించింది. ఆ వివరాల ఆధారంగానే సాధ్యాసాధ్యాల నివేదిక రిపోర్టు తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు , సంయుక్త భాగస్వామ్యం తదితర మార్గాల్లో పెట్టుబడి అంశాలను కూడా అధ్యయనం చేయాలని ఉక్కు శాఖ టాస్క్ ఫోర్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయినా ఎలాంటి పురోగతి కనిపించలేదని గఫూర్ మండిపడ్డారు.

# బెయిల్ కోసం కేజ్రీకి తప్పని ఎదురుచూపులు

### 5వతేదీకి విచారణ వాయిదా వేసిన సుప్రీం



న్యూఢిల్లీ,ఆగస్ట్23 (ప్రజా మంటలు): సీబీఐ నమోదు చేసిన ఎక్సైజ్ పాలసీ కేసులో బెయిలు కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సెప్టెంబర్ 5వ తేదీకి సుప్రీంకోర్టు శుక్రవారం వాయిదా వేసింది. దీంతో బెయిల్ కోసం కేజ్రీవాల్ మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. సీబీఐ అరెస్టును సవాలు చేస్తూ ఒక పిటిషన్, బెయిలు కోరుతూ మరో పిటిషన్‌ను కేజ్రీవాల్ అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు. ఈ పిటిషన్లలో ఒక దానికి సీబీఐ తన స్పందన తెలియజేయగా, రెండో పిటిషన్‌కు స్పందన తెలియజేసేందుకు మరింత వ్యవధి కావాలని కోర్టును కోరింది. దీంతో రెండో పిటిషన్‌పై సీబీఐ సమాధానం సమర్పించేందుకు కోర్టు వారం రోజులు గడువు ఇచ్చింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021–22లో అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో గత మార్చి 21న అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. దీనికి ముందు 2023 ఫిబ్రవరిలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అవకతవకల ఆరోపణలపై సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది.కాగా, కీలకమైన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 2025 ప్రథమార్థంలో జరగాల్సి ఉన్నాయి. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 70 అసెంబ్లీ స్థానాల్లో 62 అసెంబ్లీ స్థానాల్లో 'ఆప్' విజయకేతనం ఎగురవేసింది. బీజేపీ కేవలం 8 సీట్లకే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ ఖాతా కూడా తెరవకుండానే చతికిలపడింది.

# సినీనటి హేమకు ఊరట:మా సస్పెన్షన్ ఎత్తివేత

హైదరాబాద్,ఆగస్ట్23 (ప్రజా మంటలు): సినీనటి హేమపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) నిర్ణయం తీసుకుంది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాలతో హేమపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదం తెలిపింది. గత కొన్ని రోజుల కిందట బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో సినీ నటి హేమను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాను ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని హేమ స్పష్టం చేశారు. హేమను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఆమెను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరోసారి మీడియాకు ముందుకు వచ్చిన హేమ.. మీడియాలో వస్తున్న నిరాధారమైన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని, తనని సస్పెండ్ చేయడం సరైన నిర్ణయం కాదని అన్నారు. తాను ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని, దేశంలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నట్లు నివేదికలు సమర్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో 'మా' అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొంతమంది చేస్తున్న దుష్ప్రచారం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు లేఖతో పాటు, మెడికల్ సర్టిఫికెట్‌లను పంపారు. హేమ పంపిన ఆధారాలను పరిశీలించిన 'మా' ఎగ్జిక్యూటివ్ కమిటీ అన్ని అంశాలను పరిశీలించి, ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

# సంపూర్ణ రుణమాఫీ చేసే వరకు పోరాడుతాం

### - జర్నలిస్టుళ్లపై దాడులు ఆపండి

### - డీజీపికి కేటీఆర్ ఫిర్యాదు



హైదరాబాద్ (ప్రజా మంటలు): తమ సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. రుణమాఫీపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరితే స్పందించలేదన్నారు. రుణమాఫీపై వాస్తవాలను బయటపెడుతున్నందుకు దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌తో పాటు పలువురు భారాస నాయకులు డీజీపీని కలిశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫిర్యాదు చేశారు. గురువారం తిరుమలగిరిలో భారాస ధర్నా శిబిరంపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. శిబిరాన్ని పోలీసులే తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో బాంబుల సంస్కృతి మళ్లీ వచ్చిందని డీజీపీకి చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు చారాణా కూడా రుణమాఫీ కూడా చేయలేదు. అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేశాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి. భవిష్యత్‌లో చర్యకు ప్రతిచర్య ఉంటుందని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే.. చలో ఢిల్లీ కాదు.. చలో పల్లె చేపట్టాలని సవాల్ విసిరారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. రుణమాఫీ కాక లక్షలాది రైతులు రగిలిపోతుంటే.. వారివైపు కన్నెత్తి కూడా చూడకుండా హస్తిన యాత్రలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకటి కాదు.. రెండుకాదు.. ఎనిమిది నెలల్లో.. ఏకంగా 20 సార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడతారా..? రిమోట్ కంట్రోల్ పాలనతో రైతులను బలి చేస్తారా..? అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో అన్నీ గాలి మాటలు చెప్పారు.. గద్దెనెక్కగానే గాలిమోటర్లలో ఊరేగుతున్నారు.. మీ యాత్రలతో తెలంగాణ ప్రజలకు ఒరిగిన ప్రయోజనమేంటి..? అని కేటీఆర్ విమర్శించారు. అన్నదాతలను ఆగంచేసి.. దేశ రాజధాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తే.. రైతుల తండ్లాట తీర్చేదెవరు.. రుణమాఫీ పూర్తి చేసెదెవరు..?? అధిష్టానం మెప్పు కోసం పగలూ రాత్రి తపన తప్ప..అన్నం పెట్టే రైతుల తిప్పల గురించి ఆలోచించే తీరిక లేదా..అని ప్రశ్నించారు. రైతులకేమో మాయమాటలు.. ఢిల్లీ పెద్దలకు మాత్రం మూటలా..20 సార్లు చేపట్టిన ఢిల్లీ యాత్రలతో తెలంగాణకు దక్కింది.. గుండుసున్నా. ఓవైపు డెంగీ మరణాలు.. మరోవైపు పెరుగుతున్న నేరాలు.. ఇంకోవైపు అన్నదాతల ఆందోళనలు.. గాడితప్పిన పాలనతో.. రాష్ట్రమంతా అట్టుడుకుతున్న ఈ విపత్కర పరిస్థితుల్లో.. ముఖ్యమంత్రి, మంత్రులు ఉండాల్సింది.. ఢిల్లీలో కాదు.. తెలంగాణ గల్లీల్లో.. రాష్ట్రాన్ని గాలికొదిలేసి.. అన్నదాతలను అరిగోస పెట్టి.. హైకమాండ్ ఆశీస్సుల కోసం ప్రతిక్షణం పాకులాడితే.. తెలంగాణ సమాజమే ఏదోరోజు కుర్చీ లాగేయడం తథ్యం అని కేటీఆర్ హెచ్చరించారు. కెటిఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీప్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ తదితరులు ఉన్నారు. ఇదిలావుంటే తుంగతుర్తి రైతులపై, సీఎం రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలో జర్నలిస్టులపై జరిగిన దాడులపై డీజీపీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ కవరేజ్ కోసం వెళ్లిన మహిళా జర్నలిస్టులపై దాడి జరిగిన విషయం విదితమే. దోషులను గుర్తించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని మహిళా జర్నలిస్టులు కూడా డీజీపీని కలిసి వినతి పత్రం అందజేశారు. బాధిత జర్నలిస్టులు శుక్రవారం డీజీపీని కలిసి పరిస్థితిని వివరించారు.

**ముందు కాంగ్రెస్ పెద్దల ఇళ్లు కూల్చండి**

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమంగా ఉన్న భవనాలన్నీ కూల్చాల్సిందే.. నేతల భవనాలను కూల్చిన తర్వాత సామాన్యులవి కూల్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర డీజీపీని కేటీఆర్, సీనియర్ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన ఇల్లు బఫర్ జోన్ పరిధిలోని లేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్నారని ఓ మీడియా ప్రతినిధి కేటీఆర్‌ను ప్రశ్నించగా.. ఆయన ఈ విధంగా బదులిచ్చారు. పొంగులేటికి అంత శ్రమ అవసరం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి శాటిలైట్ మ్యాప్స్ ఉన్నాయి. ఆయన అంత బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎలా చెరువులు పూడ్చి కట్టారో అవన్నీ కూడా శాటిలైట్ ఇమేజేస్ ఉన్నాయి. చూసుకోండి.. రంగనాథ్ గారితో మాట్లాడుకోమనండి. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్న నిర్మాణాలను మొదట కూల్చడం ప్రారంభించండి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, గుత్తా సుఖేందర్ రెడ్డి లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

# తెల్లవారికి గుండె చూపిన ధీరుడు

### రాజకీయాల్లో ప్రముఖ నేతగా గుర్తింపు

### టంగుటూరి ప్రకాశం పంతులుగారి జయంతి



ఒంగోలు,ఆగస్ట్23((ప్రజా మంటలు): ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు ఆగస్టు 23, 1872న ఇప్పటి ప్రకాశం జిల్లా కనుపర్తిలో జన్మించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధునిగా, రాజకీయ నాయకుడిగా పేరుపొందిన ప్రకాశం పంతులు బ్రిటీష్ కాలంలో మద్రాసులో సైమన్ కమిషన్
వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండె చూపించి ఆంధ్రకేసరిగా ప్రసిద్ధి చెందారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా,1940, 50లలోని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించాడు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదవులు నిర్వహించిన ప్రకాశం 1957, మే 20న పరమపదించారు. దాదాపు అర్ధశతాబ్ది పాటు దక్షిణాది చరిత్రను ప్రభావితం చేసిన ప్రజానేత టంగుటూరి ప్రకాశం పంతులుగారు దక్షిణాన యావత్ ప్రజానీకంతో ప్రకాశానికున్న చొరవ, చనువు, వాత్సల్యం మరె వరికీ లేదు. పదవిలో ఉన్నా పదవిలో లేకున్నా, కొన్ని సందర్భాలలో పదవులను తృణప్రాయంగా వదిలిపెట్టినా ప్రజా సంక్షేమమే ఊపిరిగా జీవిం చాడు.
తిరుగుబాటుతనం, అన్యాయాన్ని ఎదిరిం చడం, నిజాన్ని నిర్భయంగా చెప్పడం, మనసా క్షిగా వ్యవహరించడం ఆయనకు బాల్యంనుంచే అబ్బిన సహజ లక్షణాలు.లండన్‌లో బారిష్టరు చదువు తున్న రోజులలో సిగార్ తాగి చిన్న ఉపన్యాసం ఇవ్వమని చెప్తే తల్లికిచ్చిన వాగ్దానం కోసం 'నేను పొగత్రాగి ఈ ఉపన్యాసం ఇవ్వమని చెప్తే తల్లికిచ్చిన వాగ్దానం కోసం 'నేను పొగత్రాగి ఈ ఉపన్యాసం ఇవ్వను' అని కచ్చితంగా చెప్పి ఆ దేశంలోనే చరిత్ర సృష్టిం చాడు.రాజమండ్రిలో ఉద్దండులను ఓడించి ఛైర్మన్ కావడం, మద్రాస్‌లో జడ్జిలను సైతం అప సవ్యంగా వ్యవహరిస్తుంటే ఎదురుతిరిగి సవ్యమా ర్గాన తేవడం, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా 2,000 మంది ఖైదీలను రాష్ట్ర అవతరణ సంద ర్భంగా అందరినీ విడుదల చేయడం లాంటివి తన సాహసోపేతమైన పనులు. 1907 నుంచి 1921 వరకూ మద్రాస్ న్యాయస్థానంలో తొలి తెలుగు బారిష్టర్‌గా, అయ్యర్ల, అయ్యంగార్ల సామ్రాజ్యాన్ని ఛేదించి వారికి ధీటుగా నిలబడి 'లాడమ్' మ్యాగజైన్ కొని న్యాయస్థానంలో జరిగే వక్రమార్గాలను నిర్దాక్షిణ్యంగా విమర్శించి, ప్రచు రించి ప్రిన్స్ ఆఫ్ మద్రాస్‌గా ఖ్యాతి చెందాడు. 1921లో మద్రాస్‌లో లక్షలు సంపాదించే లాయరు వృత్తిని వదిలేసి స్వాతంత్ర్యోద్యమంలో దూకిన మొట్టమొదటి ప్రఖ్యాత తెలుగు బారిష్టర్ ప్రకాశం కావడం గమనార్హం. జమీందారీ రద్దుకు ఆయన ఆద్యుడైనారు. తన సంపాదనను తృణప్రాయంగా వదులుకుని స్వరాజ్య పత్రికను నిర్వహించారు.ఆ పత్రిక ఆ రోజుల్లో ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరుగెత్తిం చింది. కాంగ్రెస్ సంస్థ అవినీతికి నెలవుగా మారిం దని భావించి దాన్నుంచి వైదొలిగి ప్రజా పార్టీ స్థాపించారు. 1952 ఎన్నికల్లో ఆంధ్ర దేశ మంతటా తిరిగి ప్రముఖులంద రినీ ఓడించారు. కర్నూలు రాజధా నిగా ఎంచుకోవడంలో పంతులు గారి దూరదృష్టి తొలుత అందరికీ అర్థం కాలేదు. కేవలం 13 నెలల కాలంలో అద్భుత నిర్ణయాలు అనేకం తీసుకు న్నారు. అందులో ముఖ్యమైనవి వెంకటేశ్వర విశ్వ విద్యాలయ స్థాపన, ప్రకాశం బ్యారేజీ, గుంటూ రులో హైకోర్టు స్థాపన, ఖైదీల విముక్తి, రైతులు, చేనేత కార్మికులపై పన్నుల ఎత్తివేత వీటిలో కొన్ని ఉదాహరణలు మాత్రమే.

# ఎన్‌సీసీ శిబిరం పేరుతో 13 ఏళ్ల బాలికపై అత్యాచారం

### అరెస్ట్‌కు ముందే నిందితుడు ఆత్మహత్య

చెన్నై,ఆగస్ట్23 ((ప్రజా మంటలు): నకిలీ ఎన్‌సీసీ శిబిరం పేరుతో 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడడంతో పాటు పలు లైంగిక వేధింపుల కేసుల్లో నిందితుడిగా ఉన్న శివరామన్ (30) మృతి చెందాడు. అరెస్టుకు ముందే పురుగుల మందు తాగిన నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఎన్‌సీసీ శిబిరం పేరుతో 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన శివరామన్ అరెస్టుకు ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. వెంటనే అతడిని కృష్ణగిరిలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో పాటు మెరుగైన చికిత్స కోసం సేలం ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే 11 మందిని అరెస్టు చేశామని, అరెస్టయిన వారిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, పాఠశాల కరస్పాండెంట్ కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఇదిలాఉండగా.. కేసు దర్యాప్తును వేగవంతం చేసి 60 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా ఇతర పాఠశాలల్లోనూ నకిలీ ఎన్‌సీసీ శిబిరాలు నిర్వహించి లైంగిక వేధింపులకు పాల్పడ్డారా అనే కోణంలో సిట్ బృందం దర్యాప్తు చేస్తుంది. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా బర్గూర్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎన్‌సీసీ క్యాంపు పేరుతో ఓ శిబిరం నిర్వహించారు. ఇందులో 17 మంది విద్యార్థినులు పాల్గొనగా వారికి అక్కడే బస ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో నిందితుడు శివరామన్ 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక ప్రిన్సిపల్‌కు చెప్పినా నిందితుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో బాలిక అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులకు విషయం తెలిసింది. వెంటనే పోలీసులను ఆశ్రయించగా.. పోక్సో చట్టం కింద 11 మందిని అరెస్టు చేశారు. అయితే నిందితుడు గతంలోనూ ఇలాంటి శిబిరాలు నిర్వహించి బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడేవాడనే ఆరోపణలు ఉన్నాయి.

## వ్యాసకర్తలకు వినతి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

**mantalukathalu@gmail.com**

**-ఎడిటర్**

## ఆశీర్వాద బలం!

తిరుమల,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): మన ఆచార వ్యవహారాల్లో శుభప్రద ఆకాంక్షలకు, ఆశీర్వచనాలకు ఉన్నత స్థానం ఉంది. మనస్ఫూర్తిగా అందించే దీవెనలు ఫలిస్తాయి. నైర్మల్యంతో, త్రికరణశుద్ధిగా ఉచ్చరించే పదాలు మంత్రాలవుతాయి. క్రియలుగా మార్పు చెందుతాయి. విత్తనాలు నాటిన తర్వాత మంచి ఆలోచనలూ, నడవడికా ఉన్న వ్యక్తులు స్పృశించిన నీళ్లు చల్లితే అవి శీఘ్రగతిన మొలకెత్తాయని, మామూలు జలంతో పెరిగే మొక్కల కంటే ఏపుగా పెరుగుతా యంటారు పెద్దలు. ప్రతి దాంట్లో మనకు తెలియని విషయం ఏదో దాగి ఉందంటారు పెద్దలు. అది పంచభూతాలకూ వర్తిస్తుంది. మంత్రాలకు ప్రాథమిక ఆధారం ఇది. శుభభావనలతో కూడిన మంత్రం మన చుట్టూ గుణాత్మకమైన మార్పును కలగజేస్తుంది. గాయత్రీ తదితర మంత్రాల ఉచ్చారణతో ఒక ప్రత్యేక -ఎలక్ట్రో డైనమిక్ ఫీల్డ్ ఏర్పడుతుంది. ఎంత అధిక సంఖ్యలో మంత్రం పునశ్చరణ చేస్తే అంతగా ప్రభావం ఉంటుంది. విశ్వశాంతికి అదే మూలమవుతుంది.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు నిర్వహణకు మేం సిద్ధం

**- తెలంగాణలో జాతీయ క్రీడకు అవకాశమివ్వండి**

**- గతంలో నిర్వహించిన అనుభవం ఉంది**

**- కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవీయతో సీఎం రేవంత్**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఒలింపిక్స్, ఆసియన్, కామన్‌వెల్త్ గేమ్స్ వంటి జాతీయ, అంతర్జాతీయ క్రీడలు తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి మనసుఖ్ మాండవీయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2025కు హైదరాబాద్ ను వేదిక చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి మనసుఖ్ మాండవీయాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. జాతీయ, అంతర్జాతీయ క్రీడలు నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు తెలంగాణలో ఉన్నాయని కేంద్ర మంత్రి మాండవీయకు తెలిపారు. హైదరాబాద్‌లోని స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాలు, సింథటిక్ అ÷-లథెటిక్ ట్రాక్స్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్, ఇతర క్రీడలకు సంబంధించీ వసతులు ఉన్నాయని సీఎం వివరించారు. 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, 2007లో ప్రపంచ మిలటరీ గేమ్స్ హైదరాబాద్ వేదికగా జరిగిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. తెలంగాణలో యువత క్రీడా నైపుణ్యాల వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్పోర్ట్స్ యూనివర్సిటీల్లో క్రీడలకు సంబంధించిన అన్నీ రకాల శిక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయనకు చెప్పారు. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన ఆర్థికసాయం అందజేయాలని మాండవీయను కోరారు. క్రీడా వసతుల అభివృద్ధి కోసం ఖేలో ఇండియా పథకం కింద విడుదల చేసే నిధుల మొత్తాన్ని తెలంగాణకు పెంచాలని విన్నవించారు. జీఎంసీ బాలయోగి స్టేడియం, షూటింగ్ రేంజ్, ఎల్బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి సమర్పించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# అప్పుల్లోకి నెడుతున్న ఉచిత పథకాలు !

రుణమాఫీపై రచ్చ నడుస్తోంది. ఉచిత బస్సు పథకంపైనా విమర్శలు వస్తున్నాయి. ఆధునికంగాఅభివృద్ధి చెందుతున్న ఈ కాలంలోనూ ఇంకా ఉచిత పథకాలతో ఓటు బ్యాంక్‌ను రూపొందించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇలా చేసినప్పటికీ తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్ మట్టి కరిచారు. ప్రజలు తాత్కాలిక తాయిలాలకు ఓటేయరని ఈ రెండు రాష్ట్రాల్లో ఫలితాలు నిరూపించాయి. అయినా ఇంకా వీటిచుట్టే పాలకులు తిరుగుతున్నారు. తాజాగా దళితబధు అమలు చేయాలంటూ కొందరు ప్రజాభవన్ ముట్టడికి యత్నించారు. రైతు రుణమాఫీపై రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ గురువారం ఆందోళనలకు దిగింది. ఇలా తమ థకాలను అమలు చేయాలని రెచ్చగొట్టేలా చేస్తున్నారు. ఎపిలో జగన్ కూడా ఇలాంటి ప్రయత్నాల్లోనే ఉన్నారు. ఇక్కడ బిఆర్ఎస్, ఎపిలో వైకాపా ఒకే రకమైన రాజకీయంతో సాగుతున్నారు. నిజానికి ఉచిత పథకాలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని దివాళా తీస్తున్నా..ఎవరు కూడా ప్రశ్నించడం లేదు. ఎందుకిలా అని ప్రశ్నించడం లేదు. లబ్ది పొందుతున్న వారు ఎలాగూ ప్రశ్నించరు. విపక్షాలకు కూడా ఓట్లు కావాలి గనక ప్రశ్నించడం లేదు. ఇక పన్నులు కట్టేవారు కూడా ప్రశ్నించడం లేదు. మేధావులు కూడా నిలదీయడం లేదు. ఇలా అయితే రాజకీయ పార్టీలు ఓట్ల వేటలో చేస్తున్న పథకాలు, పందేరాలతో రాష్ట్రాలు అప్పులో ఊబిలో కూరుకుపోవడం ఖాయం. ఇప్పటికే తెలంగాణ, ఎపిల్లో ఇలాంటి దుస్థితి నెలకొంది. కోలుకోలేని విధంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. రాజకీయ పార్టీల ఉచిత పథకాల హామీలపై సుప్రీంకోర్టు గతంలోనే కీలక వ్యాఖ్యలు చేసింది. అయినా రాజకీయ పార్టీలు దేశ ఆర్థిక వ్యవస్థను, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. సరికదా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్నారు. బిసిలకు లక్షరూపాయల పథకం, దళితబందు పేరుతో పదిలక్షల పందేరం అన్నీ కూడా ఆర్థిక దివాళాకు హేతువు కాగలదు. ఎపిలో అయితే జగన్ పథకాలను ప్రకటిండం, నగదు బదిలీలు చేపట్టడం నిత్యకృత్యంగా మార్చుకుని రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా అప్పుల్లో కూరుకునేలా చేశారు. దీనికి ఎక్కడో ఒకచోట చెక్ పడాల్సింది. డబ్బులు పంచే పథకాల బదులు అభివృద్ధి పథకాలపై దృష్టి సారించాలి. ఇబ్బడి ముబ్బడిగా డబ్బులను నేరు గా ఓటర్లకు బదిలీ చేసే ప్రక్రియను ఆపకుంటే దేశం ఆర్థికంగా దివాళా తీస్తుంది. అభివృద్ధి కుంటుపడుతుందని గుర్తించాలి. డబ్బులు పంచడమే అభివృద్ధి అంటూ చేస్తున్న ప్రకటనలకు ఇకనైనా చెల్లు చీటీ చెప్పాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీలు, పేదలపేరుతో చేసే పందేరాల విషయంలో సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయ పడినందున మనం అత్యున్నత న్యాయస్థానానికి గౌరవం ఇవ్వాలి. ప్రజాస్వామ్య దేశంలో ఒక అంశంపై చర్చించి చివరకు నిర్ణయం తీసుకోవాల్సింది పార్లమెంటేనని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆనాటి చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ పునరుద్ఘాటించిన నేపథ్యంలో దీనిపై పార్లమెంట్ విస్తృతంగా చర్చించాలి. ఏది ఉచితమో ఏది అనుచితమో చర్చించేందుకు విస్తృత ప్రజాభిప్రాయం సేకరించాలి. గ్రామస్థాయి వరకు వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న పందేరాలపై చర్చ చేయాలి. ప్రజలు కూడా నిర్భయంగా చర్చించాలి. రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజలు, ఆర్థిక నిపుణలు ఎవరికి వారు తమ స్థాయిలో చర్చించి ఏది ఉచితమో..ఏది అనుచితమో..ఏది అవసరమో చర్చచేయాలి. విపక్షాలు కూడా ఉచితాలను ప్రకటించి ఓట్లు పొందాలన్న కక్కుర్తిలో పడి ఏదిపడితే అదే అన్నట్లుగా హామీలు గుప్పిస్తున్నారు. ఢిల్లీ, కర్నాటకలో ఇలా హామీలు గుప్పించి అధికారం పొందారు. కానీ ఇదే సందర్భంలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. ప్రజలే ఈ విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలి. ఉచితంగా డబ్బులు అందుతున్నాయి గదా అనుకుంటే..పన్నుల రూపంలో మన జేబులు దోచేస్తున్న తీరును గుర్తించడం లేదు. తాము కష్టపడి పన్నుల రూపంలో కడుతున్న డబ్బులను ఉచితం పేరుతో ఇష్టానుసారంగా పంచిపెడుతూ రాజకీయ లబ్ది పొందుతున్న పార్టీలను దూరం పెడితే అసలు సమస్యే రాదు. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా రాజకీయ పార్టీలు అమలు చేసే ఉచిత పథకాలను నియంత్రించేలా కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఏదో నిర్ణయం తీసుకోవాలి. చట్టబద్ధంగా ఇలాంటి ఉచిత పథకాలపై నియంత్రణకు దిగాలి. లేకుంటే పాలన అంటే పంచడం అన్నదే పనిగా పెట్టుకో గలరు. పార్లమెంటులో చర్చ చేసి ఉచిత పంపకాలపై ఆంక్షలు విధించాలి. దేశ ఆర్థిక పరిస్థితులు, ప్రజల సంక్షేమం గురించి ఆసక్తి ఉన్నవారు వీటిని దృష్టిలో ఉంచుకొని సూచనలు చేయాల్సిన సమయం ఆసన్న మైంది. ఉచిత పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ మొదలు పెట్టాల్సి ఉంది. అలా వచ్చిన సూచనలను పార్లమెంటు ముందు పెడితే అక్కడ చర్చించి అయినా చట్టం చేస్తారేమోనని భావించాలి. ఇలాంటి విషయాల గురించి ప్రస్తావించడం ద్వారా దేశంలో ఓ అవసరమైన చర్చకు ఇప్పుడు నాంది పలకాలి. అయితే చర్చలకు దూరంగా ఉంటున్న మోడీ ప్రభుత్వం ఈ విషయంలోనూ చర్చకు ముందుకు వస్తుందన్న అవకాశం లేదని గతేడాదిగా చూస్తున్నాం. కానీ ఇప్పటికీ నిజాయితీగా ఉన్న నేతలు దీనిపై చర్చ చేస్తే మంచిది. తమ డబ్బులను పందేరం చేస్తున్న నేతల తీరుపై రచ్చబండల్లో ప్రజలే చర్చించాలి. ఉచిత పథకాల అమలును ఎంతవరకు విచారించ వచ్చన్న చర్చ జరగాలి. అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పక్కనపెట్టి కేవలం ఉచిత పథకాల కోసం డబ్బు ఖర్చుపెట్టడాన్ని మెజార్టీ ప్రజలు తప్పు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గేవారి జీవనోపాధులు గుర్తించి వారిని పైకి తీసుకుని రావడంలో తప్పు లేదు. చిన్నచిన్న పరికరాల లాంటివి ఇవ్వడంవల్ల వారి జీవితంలో పెద్ద మార్పు కనిపిస్తుంది. అయితే ఆర్థిక పరిస్థితులను తెలుసుకోకుండా అమలు చేసే వాగ్దానాలను అనుమతించ కూడదని రాజకీయ పార్టీలు గుర్తించాలి. అలాగే ఉచిత పథకాలు అన్నవి పూర్తిగా ప్రభుత్వాల విచక్షణాధికార పరిధిలోని అంశమని చెప్పడానికి వీల్లేదు. ఏ రాష్ట్రమైనా ఉచిత పథకం అమలు చేస్తుంటే ప్రజలు కూడా వద్దని అనలేరు. ఉచిత పథకాలు అమలు చేయకూడదని కేంద్రం చట్టం చేస్తే..అది చట్టబద్ధతకు లోబడి ఉండాల్సి వస్తుంది కనుక జాతీయస్థాయిలో దీనిపై చర్చించాలి. అధికారంలోకి వచ్చిన పార్టీ అమలుచేసే ఉచిత పథకాల గురించి ఆర్థిక సమర్థత కూడా ముఖ్యం. అందుకే ఉచితాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి.

# ఆయుష్ టీచింగ్ ఉద్యోగాలకు పట్టిన గ్రహణం వీడేదెప్పుడో?

ఆయుష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పట్టిన గ్రహణం వీడట్లేదు. ఆర్థిక శాఖ ఆమోదం పొంది నోటిఫికేషన్ కు సిద్ధమై ఏండ్లు గడుస్తున్నా విడుదలకు నోచుకోవడం లేదు. గత సంవత్సరం జులై న ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల తో పాటు విడుదల కావాల్సిన నోటిఫికేషన్ ఆగిపోయింది మరియు గత నెల 27 న నోటిఫికేషన్ వస్తుంది అని పత్రికా ముఖంగా తెలిపినప్పటికి మళ్ళీ నోటిఫికేషన్ ఆగిపోయింది. దీనికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గత ప్రభుత్వం పది సంవత్సరాలు, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని రెండు సంవత్సరాలు అదనంగా అర్హత వయసులో సడలింపు ఇచ్చినప్పటికీ ఉద్యోగార్థులకు మాత్రం ఆయుష్ టీచింగ్ ఉద్యోగాలు అందని ద్రాక్ష చందం అయినాయి.

రాష్ట్రంలో ఉన్న రెండు కాలేజీలలో సరియైన టీచింగ్ ఫాకల్టీ లేక ప్రతి సంవత్సరం కండిషనల్ పర్మిషన్ మీద నెట్టుకొస్తున్నారు . మెడికల్ ఆఫీసర్ లను డిప్యూటేషన్ మీద వాడుకొంటూ ఫాకల్టీ క్రింద చూపిస్తూ వైద్య విద్యను నడిపిస్తున్నారు. దీని వల్ల మెడికల్ ఆఫీసర్ ఖాలీగా ఉన్న చోట రోగులకు సరియైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు .ఎక్కువ కాలం ఇలా కాంట్రాక్టు , డిప్యూటేషన్ తో వైద్య విద్యలో నాణ్యత లోపిస్తుందని నిపుణులు అంటున్నారు. ప్రపంచానికే ఆదర్శం గా నిలుస్తున్న ఆయుర్వేదం తెలంగాణలో నాణ్యత ప్రమాణాలు లోపించి నత్త నడకన నడుస్తుంది.

మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు అయినప్పటి నుండి ఇప్పటి వరకూ టీచింగ్ ఉద్యోగాలు ఇతర వైద్య వ్యవస్థ లో నియామకాలు జరిగాయి కానీ ఆయుష్ పై మాత్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు. దీనిపై గౌరవ వైద్య శాఖ మంత్రి గారు దృష్టి సారిస్తే త్వరగా రిక్రూట్మెంట్ జరగొచ్చు అని ఆశా వహులు కోరుచున్నాను.

రాష్ట్రంలో రెండు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలున్నాయి. వీటిలో చదివే వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ పీజీ పూర్తి చేసుకున్న వారు రాష్ట్రంలో దాదాపు 2,000 మంది వరకున్నారు. అయితే గత 12 ఏండ్ల నుంచి నేరుగా నియామకాలు లేకపోవడంతో వాటి కోసం ఇప్పుడా...అప్పుడా అని ఎదురు చూసే పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో 2008లో పోస్టుల భర్తీ కోసం అప్పటికీ పీజీలు అందుబాటులో లేరనే కారణంతో వన్ టైం ఆప్షన్ కింద అసిస్టెంట్ ప్రొఫెసర్లను నాన్-టీచింగ్ సైడ్ నుంచి తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ డిప్యూటేషన్ అక్కడితో ఆగకుండా మరో రెండు సార్లు అదే విధంగా డిప్యూటేషన్ ను 2010, 2012లో చేసింది. అయితే మరోసారి అలాంటి ప్రయత్నం చేయకుండా ఆశావహ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించి నిలుపుదల చేయించారు.

అయితే రాష్ట్రంలో ఉన్న 36 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రెండు సంవత్సరాల క్రితం కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేశారు. అపుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉండి వయసు అర్హత ఎక్కువ ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల చాలా మంది పి జి, పి హెచ్ డి లు , గోల్డ్ మెడల్ లు ఉండి టీచింగ్ అనుభవం ఉండి కూడా అర్హత సాధించ లేకపోయారు. దాని వల్ల వారు వేరే కాంట్రాక్టు ఉద్యోగాలలో చేరిపోయారు. ఇపుడు కూడా వారికి సరియైన న్యాయం జరగక పోతే వారు న్యాయపోరాటానికి సిద్ధ మయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే వయోపరిమితి దాటుతుండటంతో వీరిలో చాలా మంది అభ్యర్థులకు మరోసారికి కూడా అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులు, పీజీ అభ్యర్థుల కోసమే కాకుండా రెగ్యులర్ పోస్టుల భర్తీ ద్వారా ఆయుర్వేద వైద్యవిద్యను బలోపేతం చేసేందుకు వీలుగా పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని ఆ రంగానికి చెందిన నిపుణులు సూచిస్తున్నారు.


- రావుల రాజేశం,
సామాజిక కార్యకర్త, విద్యావేత్త
77801 85674

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన రాజన్ బాబు

**ఆగస్టు 24... కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు వర్ధంతి**



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యాలు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫొటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పడం సాధ్యం. అంతటి శక్తివంతమైనది ఫొటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫోటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం.

బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగస్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణంలో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి అరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు. బాల్యంలో రంగులు వేయడం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు,

మంచి చిత్రకారుడు కావల్సి ఉండగా, కుంచె నుండి కెమేరాకు మారడం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నప్పుడు తన కజిన్ బహుకరించిన సాధారణ కొడాక్ 620 కెమేరాతో తీసిన చిత్రాలు పెక్కుమంది ప్రశంసలు అందుకొని రాజన్ లోని ఛాయాగ్రాహకుడిని వెలికి తీసింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రహకుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలవటం జరిగింది. రాజా త్రయంబక్ రాజా, రాజన్ బాబును కుంచె స్థానంలో కెమేరా పట్టుకోమన్న సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడయి, కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటొగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫొటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రహకులుగా తీర్చిదిద్దాడు.

ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయాచిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందాడు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడెమీ ఆఫ్ ఫోటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయాగ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు.

డిజిటల్ ఛాయాగ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు దార్క్‌రూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయటానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయనిక సూత్రం పై ద్రవణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో...చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రోక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటొషాప్ లాంటి సాఫ్ట్వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భుతాలు చేశారు. తన కళా నైపుణ్యంతో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శించి, పలువురి ప్రశంసలందుకున్నరు. రాజన్ తీసిన నగ్న చిత్రాలలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠాలలో భాగంగా బోధించ టానికై, చాలా కెమేరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హొదాకు చిహ్నమైన Hasselblad-medium-format camera కూడా ఉంది. ఫిల్మ్ కెమేరా Asahi Pentax నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ Canon 400D వాడే వాతు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు రాజన్ బాబు. ఛాయాగ్రహణం ఒక భాషైతే, అందులోని వ్యాకరణమే Composition, Color, Space, Form, Proper Exposure, Angle and Light అని వివరించే వారు. ఈ మెళకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకు డవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటొగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగష్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరా బాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫోటోగ్రఫీ కళా కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.

# ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





**కొడిమ్యాల ఆగస్టు 23 (ప్రజా మంటలు) :** శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఆలయంలో ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి మెట్పల్లి ఇస్కాన్ మందిరం నిర్వాహకులు డా.నరహరి దాస్ మరియు వారి శిష్య బృందంతో పాల్గొని నగర సంకీర్తన,దివ్య ప్రవచనం, అభిషేకం,మహా హారతి, చప్పను భోగ్ (56 రకాల నైవేద్యాలు) స్వామివారికి అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ భగవంతుని, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ దాతల సహాయంతో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడమైనది. కార్యక్రమానికి భక్తులు,దాతలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ఇస్కాన్ మందిరం వారికి మరియు కార్యక్రమంలో ధన, వస్తు,శ్రమ రూపనా సహకరించిన దాతలకు, భక్తులందరికీ అర్చకులు నాగరాజు రమేష్ మరియు ఆలయ నిర్మాణ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# షాప్ ఓపెనింగ్ సందర్భంగా అన్నదానం



**జనగామ అగస్ట్ 23 (ప్రజామంటలు) :** జనగామ పట్టణానికి చెందిన మహమ్మద్ ఖలీల్ నూతనంగా చికెన్ షాప్ ఓపెన్ చేసిన సందర్భంగా పసరమడ్లలోని అతిథి చిన్నపిల్లల స్వగృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి 25 కిలోల రైస్ బ్యాగ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ.... అనాథలకు అండగా నిలబడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛంద సంస్థ మార్కస్ హోప్స్ డెవలప్మెంట్ కౌన్సిల్ డైరెక్టర్ దీప్తి రమేష్, అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యులు సల్ల మహేష్,మద్దెల కార్తిక్, యాకూబ్, ఆఫ్రోజ్,లవ్లీ నర్సింగ్ పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా అధ్యక్షులుగా చెవ్వ రాజు



**జనగామ అగస్ట్ 23 (ప్రజామంటలు) :** జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలం మేకలగట్టు గ్రామానికి చెందిన చెవ్వ రాజు ముదిరాజ్ ను ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా నియమించినట్లు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పుప్పాల వేణు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంత పెద్ద పదవి బాధ్యతలు అప్పగించినందుకు మండల అధ్యక్షులు పుప్పాల వేణుకు కృతజ్ఞతలు తెలిపారు . ఎల్లవేళలా ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉండి మండల కేంద్రంలోభారతీయ జనతా పార్టీను విస్తరింప చేస్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పుప్పాల వేణు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





గొల్లపల్లి మండల కేంద్రంలో బ్రిలియంట్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు మందస్తుగా జరుపుకున్న చిన్నారులు

# ప్రైవేట్ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను పెంచాలి

## మెడికల్ కాలేజీ సిబ్బందిని డాక్టర్లుగా పెట్టకూడదు

### జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**జగిత్యాల ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** ప్రైవేట్ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సిజేరియన్ డెలివరీల శాతం దాదాపుగా 90 శాతంగా మన జిల్లాలో ఉందని, దానిని తగ్గించాలని, రాష్ట్రంలో 60 శాతం సిజేరియన్ లు, 40 శాతం నార్మల్ డెలివారీలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కలిపి టార్గెట్ ఉందని తెలిపారు. ఆసుపత్రుల తనిఖీల కోసం డాక్టర్లచే టీం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెడికల్ కాలేజీ సిబ్బందిని డాక్టర్లుగా పెట్టకూడదని, డాక్టర్లు సెలవులో ఉన్నప్పుడు జూనియర్ డాక్టర్లు హాస్పిటల్ లో ట్రీట్ మెంట్ చేయరాదని తెలిపారు. హాస్పిటల్ పేరు ఒకరి మీద రిజిస్ట్రేషన్ ఒకరి మీద కాకుండా డాక్టర్ పేరు మీద హాస్పిటల్ రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. పేషెంట్ల దగ్గర ఎక్కువ ఫీజు, అనవసరమైన టెస్టులు చేస్తున్నట్లు ప్రజావాణిలో కంప్లైంట్స్ వచ్చినట్లు తెలిపారు. ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం 259 హాస్పిటల్స్ ట్రీట్ మెంట్ గురించి బోర్డ్ ఏర్పాటు చేయాలని, ఆరోగ్య సేవల గురించి, టెస్టుల గురించి, ఆక్సిజన్, వెంటీలేటర్స్ డిస్ప్లే చేయాలని సూచించారు. హాస్పిటల్ లో బయో మెడికల్ వేస్టేజ్ ఎలా సెగ్రిగెట్ చేయాలి అని సరైన అవగాహన లేదని మున్సిపల్ కమిషనర్లతో కోఆర్డినేట్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా హాస్పిటల్ లో డాక్టర్స్ సర్టిఫికెట్స్ డాక్టర్ ఓ. పి. రూమ్ లో పెట్టుకోవచ్చని, ఫైర్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్ మాత్రం రిసెప్షన్ దగ్గర కచ్చితంగా ఉండాలని తెలిపారు. హాస్పిటల్ లో డాక్టర్ల స్థానంలో వేరే వారు ఉండకూడదని, ల్యాబ్ టెక్నీషియన్ కి కూడా నైపుణ్యత ఉండాలని పేర్కొన్నారు. ఆసుపత్రి పేరు వేరే వారి మీద రిజిస్ట్రేషన్ అయి ఉంది డాక్టర్స్ కానీ వారు ట్రీట్ మెంట్ చేస్తున్నట్లు తమకు కంప్లైంట్స్ వస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమీయుద్దీన్, జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముసుగు జైపాల్ రెడ్డి, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.



# విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ లో ఫ్లవర్స్ డే వేడుకలు





**హుజూరాబాద్ ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** హుజూరాబాద్ పట్టణం లోని స్థానిక విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాలలో శుక్రవారం రోజున నెలవారి కార్యక్రమంలో భాగంగా కిండర్ గార్టెన్ విద్యార్థులు ఫ్లవర్స్ డే ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలు సేకరించిన పూలని అందంగా పేర్చి, పాఠశాల టీచర్లు పిల్లలకు పూలతో కలర్స్, షేప్స్ ని బోధించారు. అలాగే పిల్లలను వివిధ రకాల పూలుగా తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ మాట్లాడుతూ పూలను దేవుడిగా కొలిచే సంస్కృతి మనదని, ప్రతినిత్యం దేవుడిని పూలతో కొలుస్తామని, బతుకమ్మ లాంటి పండుగలో పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలియజేశారు. తదనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ కొండబత్తినీ శ్రీనివాస్ మాట్లాడుతూ పూలు ప్రకృతి అందించిన ప్రసాదం అని, ఈ పూలను వివిధ రకాలుగా ఉపయోగిస్తామని, కొన్ని మెడిసిన్ తయారీలో కూడా ఉపయోగిస్తారని తెలియజేశారు. తదనంతరం పూలపై ఏర్పాటు చేసిన ఉపన్యాస కార్యక్రమం, అలాగే విద్యార్థులు చెప్పిన చెప్పిన రైమ్స్ అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, కిండర్ గార్టెన్ టీచర్లు రాధిక, తిరుమల, స్రవంతి, రమనిక తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులను పోషించకపోతే చట్టపర చర్యలు మెట్ పల్లి ఆర్డీవో ఎన్. శ్రీనివాస్

**మెట్ పల్లి ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ,సంరక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని మెట్ పల్లి ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మెట్ పల్లి డివిజన్ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ,సంక్షేమ చట్టం పై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సిటీజేన్స్ జిల్లా అసోసియేషన్ ముద్రించిన వయోధికుల సంక్షేమ,రక్షణ చట్టం 2007 నియమావళి 2011 చట్టం సంక్షిప్త సమాచార అవగాహన పత్రికలను ,సీనియర్ సిటీజేన్స్ పిలుపు పుస్తకాలను మెట్ పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తల్లిదండ్రులైన వయో వృద్ధులను పోషించక నిరాదరిస్తున్న,వేధిస్తున్న వారిపై తమకి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.వేధింపులకు గురి చేసిన వారికి వయో వృద్ధుల సంరక్షణ చట్టం 2007 సెక్షన్ 24 ప్రకారం 6 నెలల వరకు జైలు శిక్ష తో పాటు జరిమాన విధించే వీలుందన్నారు. జిల్లాలో వయోధికుల రక్షణ,నిరాదరణ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ను, మెట్ పల్లి డివిజన్ పరిధి లో సేవలను అందిస్తున్న సీనియర్ సిటీజన్స్ డివిజన్ అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి,డివిజన్ కార్యవర్గ ప్రతినిధులను ఆర్డీవో అభినందించారు.సీనియర్ సిటిజెన్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జగిత్యాల,మెట్ పల్లి,కోరుట్ల డివిజన్ లో వయోవృద్ధుల కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా జగిత్యాల జిల్లా నిలిచిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వయోవృద్ధుల చట్టం పకడ్బందీగా అమలుకు జిల్లా కలెక్టర్లకు,పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. కోటి రూపాయల నిధులతో జగిత్యాల జిల్లా కేంద్రంలో చేపట్టిన వృద్ధాశ్రమ నిర్మాణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి సీతక్కకి కృతజ్ఞతలు తెలిపారు.వయోవృద్ధుల చట్టం లోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.హన్మంత్ రెడ్డి, ,మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి, మద్దెనపల్లి స్వామి,డివిజన్, మండలాల ,గ్రామాల సీనియర్ సిటిజెన్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ రాజారావుకు ఐసీఎమ్ఆర్ నుంచి ప్రశంసలు

## న్యూఢిల్లీలో ఐసీఎమ్ఆర్ సమ్మిట్ లో అప్రిసెషన్ సర్టిఫికెట్ల అందచేత

**సికింద్రాబాద్ ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** ప్రాణాంతక కరోనా పాండమిక్ సమయంలో గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలు అందించిన వైద్యసేవలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) గుర్తించింది. ఈమేరకు న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన నేషనల్ క్లినికల్ రిజిష్ట్రీ ఫర్ కోవిడ్%-%19 రిపోర్ట్ రిలీజ్ అండ్ డిస్సమినేషన్ సమ్మిట్‌లో గాంధీ మాజీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ త్రిలోక్ చందర్‌లను ఘనంగా సన్మానించి ప్రశంసపత్రాలు అందించారు. కోవిడ్ వైరస్ విజృంభిస్తున్న సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి వేలాదిమందికి వైద్యసేవలు అందించడంతోపాటు కరోన వైరస్‌కు సంబంధించిన పలు అంశాలపై రిసెర్చ్ చేసి నివేదికలను అందించారు. కరోన నియంత్రణ, నివారణ, రూపాంతరం చెందుతున్న వైనం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్‌లు రిసెర్చ్ చేసి రూపొందించిన 15 ఆర్టికల్స్ ఐసీఎంఆర్ జర్నల్‌లో పబ్లిష్ అయ్యాయి. వీరి రిసెర్చ్ నివేదికలను ప్రపంచదేశాలు ప్రామాణికంగా తీసుకుని వైద్యసేవలు అందించి, వైరస్ నియంత్రణ చర్యలు చేపట్టి లక్షలాది మంది ప్రాణాల కాపాడారు. ఐసీఎంఆర్ డైరక్టర్ జనరల్ రాజీవ్‌భల్, నీతిఅయోగ్ ప్రతినిధి వినోద్‌పాల్, నేషనల్ హెల్త్ మాజీ సెక్రటరీ రాజేష్‌భూషన్‌లు ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్‌లు అందించిన సేవలను అభినందించి అప్రిసెషన్ సర్టిఫికెట్లను అందించారు.



# పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం



**గొల్లపల్లి ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** గొల్లపల్లి మండల లోని ఇస్రాజ్ పల్లి గ్రామంలో శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బుధారపు శ్రీహరి, ఉపాధ్యక్షులు మచ్చ గణేష్, కార్యదర్శి అందె శ్రీనివాస్, కోశాధికారి మచ్చ రాజ్ కుమార్, సహకార్యదర్శి మచ్చ సాగర్ అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కొరకు అన్ని విధాల సహాయ సహకారాలు చేపడుతూ సంఘ అభివృద్ధి కొరకై పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల బంధువులు పాల్గొన్నారు.

# పెంబర్తి మహమ్మాయి దేవాలయంలో గాజుల పూజ

**జనగామ అగస్టు 23 (ప్రజామంటలు):** శ్రావణ శుక్రవారం సందర్భంగా జనగామ జిల్లా పెంబర్తి ఏకాంబరేశ్వర మహమ్మాయి దేవాలయంలో మహిళా భక్త సమాజం ఆధ్వర్యంలో అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో కొలుస్తూ గాజులతో అలంకరించి సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు.జనగామ మహిళా భక్త బృందాలు శ్రీ శైవక్షేత్ర వనితాశక్తి, సౌందర్యలహరి వారు పాల్గొని లలితా సహస్ర నామ పారాయణం చేసారు. తదుపరి మహిళలు పసుపు కుంకుమ వయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షులు అయిలా వేదాంతచారి, కార్యదర్శి అయిలా సోమనర్సింహాచారి, ఉపాధ్యక్షులు అనంతోజు బ్రహ్మాచారి, కాలూరి రమేష్, అయిలా మధుసూదనా చారి,రంగు లక్ష్మణచారి, మక్తాల రాజు తదితరులు పాల్గొన్నారు.



# ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం - 2024 పై చర్చా వేదిక కార్యక్రమం

## ఆగస్టు 2 నుండి 23 వరకు సి. సి. ఎల్. ఏ వెబ్ సైట్ లో అభ్యంతరాల స్వీకరణ

- మనుషులకు ఆధార్ కార్డ్ ఎలాగో భూములకు భూధార్ కార్డ్
- చట్టం అనేది రైతుల చుట్టంలా ఉండాలి
- గతంలో ఎన్నడూ లేని విధంగా అప్పీలేట్ అవకాశం

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**





**జగిత్యాల ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 20 రకాల చట్టాలు ఉన్న ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం- 2024 పై అభిప్రాయ సేకరణకు చర్చా వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్. ఓ. ఆర్ చట్టం 2024 అమలుపై న్యాయవాదులు, విద్యావేత్తలు, రైతులు, రైతు సంఘాలు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు, గెజిటెడ్ , నాన్ గెజిటెడ్ ఉద్యోగులు స్వచ్ఛంధ సంస్థలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... రైతులకు మనుషులకు ఆధార్ కార్డ్ ఎలాగో భూములకు భూధార్ కార్డ్ అని, చట్టం అనేది రైతుల చుట్టంలా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా ప్రజలు, రైతుల మనోభావాలను, అభిప్రాయాలను సేకరించే కార్యక్రమం, అదే విధంగా అప్పీలేట్ అవకాశం కల్పించిందని, ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా ఉండటం కోసం, అధికార వికేంద్రీకరణ కాకుండా అధికార కేంద్రీకరణ కోసం ఆర్. ఓ. ఆర్. -2024 చట్టాన్ని ప్రభుత్వం తెచ్చినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇందులో వ్యవసాయ భూములే కాకుండా వ్యవసాయేతర భూములు, అబాది భూముల గరించి చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నందున ఈ చట్టంలో వీటికి అవకాశం కల్పించే అవకాశం ఉందని తెలిపారు. చర్చ కార్యక్రమంలో పాల్గొన్న వారి అభిప్రాయాలను కలెక్టర్ డ్రాఫ్ట్ రూపంలో నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఏ చర్చా కార్యక్రమాల అనంతరం ఆర్. ఓ. ఆర్. -2024 చట్టంపై అన్నీ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని కలెక్టర్ వివరించారు. అంతకుముందు మెట్ పల్లి ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 2 నుండి 23 వరకు సి. సి. ఎల్. ఏ వెబ్ సైట్ లో అభ్యంతరాల స్వీకరణలకు తమ అభిప్రాయాలను పోస్ట్ ద్వారా గాని వెబ్ సైట్ లో గాని ధరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించిందని తెలిపారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు భూమికి ఒక నంబర్ ఉండాలన్న ఉద్దేశ్యంతొ భూధార్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. భూధార్ కార్డులు సర్వే చేసిన తర్వాత భూమి యజమానులకు మాత్రమే మంజూరు చేయడం జరుగుతుందని, భూధార్ లో తాత్కాలిక, శాశ్వత భూధార్ గురించి, హక్కుల రికార్డ్, నమోదు చేయు అధికారి, ఆబాది, వ్యవసాయేతర భూములకు సంబంధించిన రికార్డుల గురించి, మ్యూటేషన్ గురించి అప్పీలేట్ అథారిటీ గురించి వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త చట్టంలో అప్పీలేట్ అధికారులను నియమించ నున్నారని, తహశీల్దార్, ఆర్డీఓల మ్యూటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. భూమికి సంబంధించిన రికార్డ్ చేసేటప్పుడు ముందుగా ప్రిపేర్ చేసి తర్వాత మెయింటెన్ చేసి దాన్ని అప్ డేట్ చేయాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కొందరు ఈ ఆర్. ఓ. ఆర్.-2024 చట్టంపై ఈ క్రింది విధంగా తమ అభిప్రాయాలను వివరించారు. రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరంలో మనుషులకు ఎలా అయితే ఆధార్ కార్డ్ ఉందో కమతాలకు కూడా శాశ్వత నెంబర్ ఇవ్వడం అనేది చాలా మంచి విషయమని, డిజిటల్ తొ పాటు నిర్దిష్టమైన సమయం అనేది ప్రస్తావించాలని తెలిపారు. రిటైర్డ్ తహశీల్దార్ గంగారామ్ మాట్లాడుతూ.... 2017 లో భూమి రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు చాలా అవకతవకలు జరిగాయని, ఇనామా భూములపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని, వ్యవసాయేతర భూములకు కూడా పట్టా పాసుపుస్తకం ఇవ్వడం కాకుండా, చిన్న సన్నకారు రైతులకే కాకుండా సాదా బైనామా ఉన్న అందరికీ పట్టా ఇస్తే బాగుంటుందని,అన్నారు. మహేందర్, న్యాయవాది మాట్లాడుతూ.... మ్యూటేషన్ లో ఎక్కడ కుటుంబ సభ్యుల సెటిల్ మెంట్ ఆస్కారం ఉందా?, రెవెన్యూ రికార్డ్ లో వ్యవసాయ భూమిని చూపించారు డెయిరీ ఫామ్స్, పౌల్ట్రీ ఫామ్స్ గురించి ప్రస్తావించలేదని తెలిపారు. గ్రామానికి ఒక అధికారిని నియమించి రెవెన్యూ ట్రిబ్యునల్ ఎస్టాబ్లిష్ చేయాలి. రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంప్ పేనాల్టీలో ప్రస్తుత మార్కెట్ రేటు కాకుండా ధరఖాస్తు చేసినప్పుడు ఏ రేటు ఉందో అదే ఉంచాలని వివరించారు. సీనియర్ సిటిజన్ హరి అశోక్ కుమార్ గతంలో లాగా వీఆర్ఓ వ్యవస్థను పునరుద్ధరించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, రైతుల నుండి భూమిని సేకరించిన తర్వాత ధరణి పోర్టల్ లో డెలిట్ ఆప్షన్ లేక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. శంకర్, రైతు మాట్లాడుతూ ధరణి పోర్టల్ ద్వారా చాలా మంది రైతులు నష్టపోయారని, అన్యాయలు, అక్రమాలు ఉండడం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. అధికారులు రైతుల భూములు డెలిట్ చేయడం వల్ల రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని వి. ఆర్. ఓ. వ్యవస్థను పునరుద్ధరిస్తే బాగుంటుందని తెలిపారు. దేవాదాయ శాఖకు కొంత భూమిని రైతులు ఇచ్చినప్పుడు మిగతా భూమికి అదే సర్వే నంబర్ ఉండడం వల్ల రైతులు భూమిని అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.కుమార స్వామి సర్వేయర్ మాట్లాడుతూ.... రైతుల భూములు పట్టా మీద ఒక విధంగా, మోక మీద ఒక విధంగా ఉంటుందని అలా కాకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ క్లస్టర్ వైజ్ గా డిప్యూటీ సర్వేయర్లను నియామిస్తే మోకా మీదకి పోయి వచ్చి డైరెక్ట్ గా గూగుల్ మ్యాప్ తీసుకుని పహాని మరియు మ్యాప్ ను రెండు ఒకే సమయంలో చేయడం వల్ల ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. రెవెన్యూ ట్రెసా అధ్యక్షుడు వకీల్ మాట్లాడుతూ.... ప్రజల మనోభావాలను, అభిప్రాయాలను తీసుకోవడం చాలా మంచి విషయమని, ధరణి-2020 కి చట్ట బద్ధత లేదని ఎటువంటి సూచనలు తీసుకోకుండా కొందరి లభ్యం కోసం ఏర్పాటు చేశారని వివరించారు. చట్టం అనేది రైతులకు చుట్టంలా ఉండాలని తెలిపారు. విరాసిత్ ను సులభతరం చేయాలని సూచించారు.జిల్లా టి ఎన్ జి ఓ అధ్యక్షుడు శశిధర్ మాట్లాడుతూ.... సెక్షన్ 1 (25) లో రెవెన్యూ విలేజ్ కి ఎవరు బాధ్యత వహిస్తారని, రైతు ప్రతి సారి ఎమ్మార్వో ఆఫీస్ కు వచ్చి చెక్ చేసుకోలేదని, అదే విధంగా మీ సేవకి వెళ్ళి పహాని తీయాలంటే రైతులు ఇబ్బంది పడుతున్నారని, ప్రతి గ్రామంలో ఒక ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీఓలు మధు సుధన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, రెవెన్యూ ట్రెసా అధ్యక్షులు వకీల్, జిల్లా టీఎన్జీఓ అధ్యక్షులు శశిధర్, న్యాయవాదులు, విద్యావేత్తలు, రైతులు, రైతు సంఘాలు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అడిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి





**భీమదేవరపల్లి ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** మండల కేంద్రం భీమదేవరపల్లి, ముల్కనూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మారుపాటి మహేందర్ రెడ్డి చిన్న కూతురు, ముల్కనూర్ సొసైటీ రిటైర్డ్ ఉద్యోగి అలిగిరెడ్డి లింగారెడ్డి (చిన్న) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పరామర్శించి బాధిత కుటుంబాలకు మనో ధైర్యాన్ని నింపారు. వీరి వెంట ములుకనూర్ మాజీ సర్పంచ్ లు మంగ రామచంద్రం, ప్రెస్ కొమురయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొడకండ్ల సుదర్శన్ రెడ్డి, మార్పటి శ్రీనివాస్ రెడ్డి వారితోపాటు గ్రామ పెద్దలు మార్పాటి జయపాల్ రెడ్డి, మార్పాటి సుదర్శన్ రెడ్డి, మార్పాటి శ్రీనివాస్ రెడ్డి, మాచర్ల కుమారస్వామి, గాజుల కుమారస్వామి, డబ్బా శంకర్, మండల అధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య, ఎదులాపురం సమ్మయ్య, భద్రయ్య తదితరులు ఉన్నారు.

# గాంధీలో మంకీ పాక్స్ ఐసోలేషన్ వార్డుల ఏర్పాటు




**సికింద్రాబాద్ ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** గాంధీ ఆసుపత్రిలో ముందు జాగ్రత్తగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపాక్స్(మంకీపాక్స్) బాధితుల కోసం రెండు ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. పురుషులకు, మహిళ పేషంట్లకు వేర్వేరుగా 14 బెడ్లతో కూడిన రెండు ఐసోలేషన్ వార్డులు సిద్దంగా ఉన్నాయన్నారు. ఇంతవరకు ఎంపాక్స్ పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. ఎంపాక్స్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలిసి చికిత్స పొందాలన్నారు.

# సిపిఎస్ వద్దు, ఓపిఎస్ ముద్దు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



**మల్లాపూర్ ఆగస్ట్ 23 (ప్రజా మంటలు) :**మండల కేంద్రంలో జరిగినటువంటి నిరసన కార్యక్రమంలో సిపిఎస్ అనగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అనేది ఉద్యోగుల పాలిట శాపంగా మారింది దీనికి నిరసనగా మండల కేంద్రంలో టి ఆర్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరు సురేష్ ఆధ్వర్యంలో సిపిఎస్ పెన్షన్ కు వ్యతిరేకంగా నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మద్దెల రాజరత్నం మరియు ఇతర టిఆర్టిఎఫ్ కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది సిపిఎస్ అనేది గత ప్రభుత్వం రద్దు చేస్తామని హామీ ఇచ్చి రద్దు చేయలేదు. చాలా రాష్ట్రాల్లో సిపిఎస్ అనేది రద్దుచేసి పాత పెన్షన్ అనేది ఇవ్వడం జరిగింది. కానీ తెలంగాణ ప్రభుత్వం అనేది ఇవ్వడం లేదు. కావున ఈ ప్రభుత్వం వెంటనే సిపిఎస్ ను రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టిఆర్టిఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.ఇట్టి కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ జిల్లా బాధ్యులు మహిపాల్ రామన్ మరియు గణేష్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంటి ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నిక



**హనుమకొండ ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ గురువారం చంటి ముదిరాజ్ కు నియామక పత్రాన్ని అందజేశారు.గతంలో ఇదే సంస్థలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజల్లో అవగాహన సదస్సులు పెడుతూ ప్రజలను, విద్యార్థులను చైతన్య పరుస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుండి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ కు మరియు జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్ కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికా రులపై చర్యలు తీసుకుంటుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, నంగునూరు మండల అధ్యక్షులు అశోక్ యాదవ్, గుండెల రాయుడు, బోదాస్ జగన్, ఎం.డి మున్న, జి. భాను ప్రసాద్, వెంకటేష్ యాదవ్, నమిండ్ల హరీష్ పాల్గొన్నారు.







బహుజన, సామాజిక తత్వవేత్త, బి.ఎస్. రాములు 75 వ జన్మదినోత్సవవం హైదరాబాద లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమ దృశ్యమాలిక

# హాస్టల్లో జాయిన్ చేస్తున్న బెంగతో విద్యార్థి క్రిమిసంహార తాగి మృతి

**గొల్లపల్లి ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** గొల్లపల్లి మండలంలోని గోవిందపల్లి గ్రామానికి చెందిన 16 సం,అమ్మాయి బుదవారం తన తల్లిదండ్రులు జగిత్యాల లోని హాస్టల్లో జాయిన్ చేస్తాను అని చెప్పగా ఆమె బెంగతో బయపడి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగినట్లు గమనించిన వెంటనే జగిత్యాలలోని ప్రైవేట్ హాస్పిటల్ చేర్పించారు. మెరుగైన వైద్యం కొరకు ప్రతిమ హాస్పిటల్ కి తరలించారు. అక్కడి డాక్టర్లు సూచలన మేరకు ఎల్లారెడ్డిపేట లో గల అశ్విని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు బద్దం అజిత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై సిహెచ్ సతీష్, తెలిపారు.

# ప్రధానోపాధ్యాయులు ఆదిరెడ్డి కి వీడ్కోలు సమావేశం



**కొడిమ్యాల ఆగస్టు 23 (ప్రజామంటలు) :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలము లోని సంద్రాళ్లపల్లి ప్రాథమిక పాఠశాల లో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఇటీవల స్కూలు అసిస్టంట్ సోషల్ ప్రమోషన్ పొందిన ఏనుగు ఆదిరెడ్డి కి గ్రామస్తులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి , శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడికి గేట్, ప్రహరీ గోడ పెట్టివ్వడం, వివిధ కార్యక్రమాలు చేపట్టడం, విద్యార్థుల సంఖ్య పెంచి పాఠశాల అభివృద్ధికి ఆదిరెడ్డి కృషి చేశారనీ కొనియాడారు. ఈ కార్యక్రమం లో కేజిబివి ప్రత్యేక అధికారి మంద లింగవ్వ, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు అశోక్, గ్రామస్తులు పెంకాసుల మల్లయ్య,ఇట్నవేనీ మహేందర్, సీ ఆర్ పి సాయిలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మెన్ తైదల స్రవంతి, ఉపాద్యాయులు స్వర్ణ, తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో యువకుడి హఠాన్మరణం నివాళులు అర్పించిన ముల్కనూర్ సొసైటీ ఉద్యోగులు



**భీమదేవరపల్లి ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన భీమదేవరపల్లి మండలంలోని గట్లనరసింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అడ్డగట్ల శ్రీనివాస్ (30) అర్ధరాత్రి నిద్రలో గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. మృతుడు ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం మార్కెటింగ్ సొసైటీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ హఠాన్మరణం మరణం పట్ల తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతకుముందు తమతో కలిసిమెలిసి పనిచేసిన సహచరుడు అర్ధరాత్రి మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు.

# తెలంగాణ హక్కుల రికార్డు చట్టం (ఆర్.ఓ.ఆర్. ఆక్ట్ - 2024) సాయిదాపై చర్చా వేదిక

**జనగామ ఆగస్ట్ 23 (ప్రజామంటలు):** జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అధ్యక్షతన ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్నలతో కలిసి నూతన ఆర్ఓఆర్ చట్టం - 2024 ముసాయిదాపై చర్చా వేదికగా (వర్క్ షాప్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న నూతన ఆర్ఓఆర్ - 2024 చట్టం రూపకల్పనలో ప్రజలు, రైతులు, రైతు సంఘాల నాయకులు, సీనియర్ అధికారులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణ కోసం ఈ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. జనగామ ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ.. భూముల రికార్డింగ్ అథారిటీ తహసీల్దార్ లకు ఇవ్వాలని, అప్పీల్ అధికారాలు ఆర్డీఓ లకు, రీ అప్పీల్ అధికారాలు కలెక్టర్ లకు ఇవ్వాలని, ఆ పైన సివిల్ కోర్టును ఆశ్రయించే విధంగా ఉండాలని తెలిపారు. ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓ వెంకన్న మాట్లాడుతూ.... ఈ కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని అందరూ స్వాగతించాలని కోరారు. ఎంతో వేగంగా, సులభ రీతిలో అయ్యే విధంగా ఈ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా వివిధ రంగాల ప్రజలు, రైతులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఘనపూర్ (స్టేషన్) బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది, కనకం రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురావడం చాలా మంచి పరిణామం అని తెలిపారు. సామాజిక కార్యకర్త, కిష్టయ్య మాట్లాడుతూ.. భూముల సర్వే చేశాకే భూదార్ ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. మ్యుటేషన్స్ పాత సర్వే నంబర్ లోనే ఇవ్వాలని, ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిణి నియమించాలని, దాంతో సిబ్బంది కొరత లేకుండా చూడాలని తెలిపారు. సాధిక్ ఫౌండేషన్ ఛైర్మన్, హైకోర్టు న్యాయవాది, సాధిక్ అలీ మాట్లాడుతూ.... భూముల వివరాలను ఆన్లైన్ కాకుండా పేపర్ పై రాసి ఇవ్వాలని, జమాబంధీ కావాలని, ఎంతో కొంత భూమి శిస్తు పెట్టాలని, అప్పీలుకు 90 రోజుల సమయం కేటాయించాలని, రెవెన్యూ కోర్టులు కాకుండా జ్యుడీషియరీ కోర్టులు రావాలని, 3 నెలల్లో 4 పేషీల్లో భూముల కేసులను ముగించాలని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు, తమ్మడపల్లికి చెందిన వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది ఉండాలని, ఫీల్డ్ సర్వే చేయకుండా హద్దులు నిర్వహించకూడదు అని, అసలు భూమి ఎంత ఉంది స్పష్టంగా రాయాలని, పహానీలు కొనసాగాలని తెలిపారు. తరిగొప్పుల తహసీల్దార్ చారి మాట్లాడుతూ.. పహానీలు కచ్చితంగా ప్రింట్ అవుట్ తీసుకొని పెట్టుకోవాలని, మ్యుటేషన్, సక్సెషన్ కేసులకు ఎలాంటి వసూళ్లు చేయకుండా నమోదు చేయాలని తెలిపారు. అలాగే ఈ చట్టం ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణ చేయాలని, వివిధ మ్యుటేషన్లలో వేరుగా పడిన భూమిని విభజించాలని, మండలాల వారీగా రెవెన్యూ అధికారులు, సర్వేయర్లను, నియమించాలని, మరి కొందరు సూచనలు తెలిపారు. అంతకుముందు ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ వర్గాల వారి సందేహాలకు విశ్రాంత తహసిల్దార్ శంకరయ్య, సంబంధిత రెవెన్యూ అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ చర్చా వేదికలో అన్ని మండలాల తహసీల్దార్లు, ప్రజలు, రైతులు, రైతు సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, సీనియర్ అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.




## 5 వేలు ఆర్థిక సహాయం అందించిన పెంబర్తి కురుమ సంఘం బండ భూపాల్



**జనగామ అగస్టు 23 (ప్రజామంటలు) :** జనగామ మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన సంకటి రామ్మూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొని వారి ఆర్థిక పరిస్థితి బాగ లేనందున పెంబర్తి కురుమ సంఘం ఉపాధ్యక్షుడు బండ భూపాల్ బాధిత రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించిన భూపాల్ కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. వారి వెంట సంకటి రాజు, కంతిరి రాజు, బండ ప్రభాకర్, ఆవుల ప్రశాంత్ రెడ్డి, గుండా రాజు, సంకటి రమేష్, మేకల గిరి, సంకటి శ్రీధర్ ఉన్నారు.

## కొప్పూర్ లో హెల్త్ క్యాంప్



**భీమదేవరపల్లి అగస్టు 23 (ప్రజామంటలు) :** మండలంలోని కొప్పూర్ గ్రామంలో వంగర పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ ముతార్ రెహమాన్, డాక్టర్ రుబీనా తమ వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంగర ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# టీకా వికటించి సౌదీలో యాతన ఇండియాకు వాపస్ తెప్పించాలని వేడుకోలు

- విదేశాంగ అధికారి పిఓఇ కి ఫిర్యాదు చేసిన బాధితుడి తల్లి
- హైదరాబాద్ గల్ఫ్ మెడికల్ సెంటర్ నిర్లక్ష్యంపై విచారణకు డిమాండ్

(రామ కిష్టయ్య సంగన భట్ల)




**జగిత్యాల ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** గల్ఫ్ కు వెళ్లే క్రమంలో హైదరాబాద్ లోని ఒక 'గల్ఫ్ మెడికల్ సెంటర్' లో వైద్య పరీక్షలతో పాటు, టీకా ఇంజక్షన్ వేయించుకుని 'ఫిట్' సర్టిఫికెట్ తో సౌదీకి వెళ్లిన ఒక యువకుడు టీకా వికటించి అనారోగ్యం పాలైన సంఘటన బాధితుడి తల్లి విదేశాంగ శాఖ కు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. సౌదీలో ఉద్యోగం చేస్తున్న జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెమ్ గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ ఆరోగ్యం క్షీణిస్తున్నందున అత్యవసరంగా ఇండియాకు వాపస్ తెప్పించాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్ లోని విదేశాంగ శాఖ, పిఓఇ (ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్) కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. గల్ఫ్ జెఏసి చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ ఆమె వెంట ఉన్నారు. చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్ లోని ఎస్కే మెడికల్ సెంటర్ (గల్ఫ్ దేశాలు గుర్తించిన వైద్య కేంద్రం) లో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. జులై 11 నాడు ఉద్యోగ వీసాపై సౌదీ అరేబియాలోని అల్-బాద్, తాబూక్ కు వెళ్లి ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్ లో క్లీనింగ్ సూపర్ వైజర్ గా చేరాడు. టీకా ఇంజెక్షన్ వలన ఇన్ఫెక్షన్ తో కుడి భుజం గాయమై రక్తం కారుతున్నా కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని మెరుగైన చికిత్స కోసం తనను ఇండియాకు పంపించాలని చంద్రశేఖర్ కోరుతున్నాడు. ఈమేరకు తన ఉద్యోగానికి రాజీనామా కూడా సమర్పించాడు. సెప్టిక్ అయి భుజం కొట్టేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని అతను ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఢిల్లీ లోని హెచ్.ఆర్. ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా చంద్ర శేఖర్ సౌదీ వెళ్ళాడు. తన కుమారుడిని వాపస్ తెప్పించడంలో ఏజెన్సీ వారు సహకరించాలని తల్లి లక్ష్మి కోరారు. నిర్లక్ష్యంగా టీకా వేసి తన కుమారుడి అనారోగ్యానికి కారకులైన హైదరాబాద్ లోని ఎస్కే మెడికల్ సెంటర్ పై ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ తగిన విచారణ చేయాలని ఆమె కోరారు. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి విజ్ఞప్తి మేరకు సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) వాలంటీర్ రంజిత్ చిత్తలూరి బృందం చంద్రశేఖర్ కు సహకరిస్తున్నారు.

## పద్మారావునగర్ పార్కు ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు




**సికింద్రాబాద్ ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** పద్మారావునగర్ పార్కు ఫుట్ పాత్ ను ఆక్రమించుకొని, గత కొంతకాలంగా అక్రమంగా దుకాణాలు నడిపిస్తున్న వారిపై చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు చిలకలగూడ ట్రాఫిక్ ఎస్.హెచ్.ఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు పద్మారావునగర్ పార్కు వద్దకు చేరుకొని, ఫుట్ పాత్ లపై ఉన్న అక్రమ దుకాణాలను తొలగించారు. అలాగే వీరికి ఫైన్ కూడ వేసినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఇకపై ఫుట్ పాత్ లను ఆక్రమించి, దుకాణాలను పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా నిర్మించిన ఫుట్ పాత్ లను పలువురు ఆక్రమించుకొని, వ్యాపారాలు చేస్తుండగా, ఫుట్ పాత్ ను తాము వినియోగించుకోలేక పోతున్నామని పార్కుకు వచ్చే వాకర్స్ వాపోతున్నారు.

# రాష్ట్ర గవర్నర్ పర్యటనకు ఏర్పాట్ల పరిశీలించిన కలెక్టర్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

**జనగామ అగస్టు 23 (ప్రజామంటలు):** ఈనెల 29న జనగామ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నిమిత్తం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వివిధ శాఖలను సందర్శించి, పర్యవేక్షించారు. గవర్నర్ పర్యటనకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అందుకు తగిన అన్ని ఏర్పాట్లపై జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జనగామ మండలంలోని ఓబులకేశ్వాపూర్ గ్రామ పంచాయతీలో గల వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద గల మినీ ఆడిటోరియాన్ని సందర్శించి, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 20 మంది రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల మరమ్మతులు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, భోజన వసతులు, తాగునీరుకు సంబంధించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బీదల బస్తీలో ఫ్రైడే - డ్రై డే అవెర్నెస్ ర్యాలీ




**సికింద్రాబాద్ ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** సికింద్రాబాద్ సీతాఫల్మండి కుట్టివెల్లోడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీదలబస్తీలో ఫ్రైడే - డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులు - దోమల వ్యాప్తి అంశంపై స్థానికులకు అవగాహన కల్పించారు. వానకాలంలో మలేరియా, డెంగ్యూ లాంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరు తమ ఇండ్ల పరిధిలో నీరు నిల్వ లేకుండా, పొడిగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్లకార్డులు, బ్యానర్లతో బస్తీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుట్టివెల్లోడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎస్పీఎమ్, సిబ్బంది పాల్గొన్నారు.

## సఖి సెంటర్ అందించే సేవలపై కేజీబీవీ విద్యార్థులకు అవగాహన సదస్సు






**భీమదేవరపల్లి ఆగస్ట్ 23 (ప్రజామంటలు):** చట్టాలపై, సఖి అవగాహన కార్యక్రమాలపై భీమదేవరపల్లి కస్తూరిభా గాంధీ బాలిక విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి ఆధ్వర్యంలో సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ పాల్గొని సఖి సేవలను అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ కేస్ వర్కర్స్ వినీల, హరిత సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సేవలు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం లాంటి ఐదు రకాల సేవలను గూర్చి వివరించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు వీటి నుండి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని వివరించారు. సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని పనిచేస్తారని, సమస్య ఉంటే 181 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం, రక్షణ లభిస్తుందని, 0870 2452112 అనే నెంబర్ కి కాల్ చేయడం ద్వారా సహాయం బాధిత మహిళలకు సహాయం అందించ బడుతుందని అన్నారు.

## జమ్మికుంటలో నియోజకవర్గ పరిధిలో పలు వివాహ వేడుకలలో, ఎస్.కె. మార్ట్ లో లక్కీడ్రా లో పాల్గొన్న ప్రణవ్.



**జమ్మికుంట ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సుడిగాలి పర్యటన చేశారు. నియోజకవర్గ పరిధిలో పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చిన్నారులు ప్రణవ్ తో సెల్ఫీ దిగడానికి ఉత్సాహం చూపెట్టారు. అనంతరం జమ్మికుంట పట్టణంలోని ఎస్.కె. మార్ట్ లో నిర్వహించిన లక్కీ డ్రా లో పాల్గొన్నారు. లక్కీ డ్రా లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బూటకపు ధర్నాలు మానుకోండి

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హెచ్చరిక

- ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నాం...
- రుణమాఫీ అయిన వ్యక్తులు ధర్నాలో కూర్చోవడం ఏంటి?
- సాంకేతిక లోపాలతో కొన్ని బ్యాంకుల్లో కాలేవు
- త్వరలోనే వాటిని పూర్తిచేస్తాం... వ్వాడి కృష్ణారావు



**కోరుట్ల ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గల జువ్వాడి భవన్ లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ గురువారం కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రైతులతో కలిసి ధర్నా చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గత పది ఏళ్ల పాలనలో మీరు రైతులకు ఏం చేశారో చెప్పాలని నడుస్తున్న ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని మూసి వేయించిన ఘనత మీది కాదా అని ఆయన ప్రశ్నించారు. కేవలం మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను, రైతులను పక్కదోవ పట్టించడం కోసం ఇలాంటి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలు, రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుంటే, అది చూచి జీర్ణించుకోలేక ఇలాంటి ధర్నాలు చేయడం ఏంటాని ఆయన ప్రశ్నించారు. కల్లూరు గ్రామానికి చెందిన వనతడుపుల అంజయ్య, మాదాపూర్ మాజీ సర్పంచ్, జోగిని పెల్లి మాజీ సర్పంచ్, చిన్న మేట్ పల్లి మాజీ సర్పంచ్ తో పాటు మరికొంతమంది బిఆర్ఎస్ నేతలకు రుణమాఫీ అయ్యింది. అలాంటి వ్యక్తులు బూటకపు ధర్నాలో కూర్చోవడం ఏంటాని, మీకు అయిన రుణమాఫీని తిరిగి మళ్ళీ ప్రభుత్వానికి సరెండర్ చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. గురువారం జరిగిన ధర్నాలో రుణమాఫీ అయినా టిఆర్ఎస్ నాయకులను కూర్చోబెట్టుకోవటం ఏంటాని దీనికి ఎమ్మెల్యే సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. గతంలో మీరు చేస్తామన్న రైతు రుణమాఫీ ఎంత మందికి చేశారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయడమే కాకుండా పేద ప్రజల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్నామన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో కొన్ని బ్యాంకుల్లో రుణమాఫీ కాలేదని అవి కూడా త్వరలోనే పూర్తవుతాయన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో మీకంటే మెరుగ్గానే విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి సభ్యులు గంగాధర్, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు వసీం, పట్టణ ప్రధాన కార్యదర్శి నజ్జు, కార్యదర్శి మ్యాకల నర్సయ్య, బన్న రాజేష్, సహాయ కార్యదర్శి ఎంబెరి సత్యనారాయణ, సోషల్ మీడియా ఇన్చార్జి వాసం అజయ్, చిట్యాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ సంఘ లింగం, సోగ్రాభి, కటుకం దివాకర్, రాకేష్, రషీద్, పసుల కృష్ణ ప్రసాద్, మధు, నేతి శ్రీనివాస్, కరిపెల్లి అజయ్, క్యాస సంజీవ్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా..

## వొడితల ప్రణవ్ బాబు



**జమ్మికుంట ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటూ చేయూత అందిస్తానని, ఆపద ఉన్నవారు సమాచారం అందిస్తే తప్పకుండా స్పందిస్తానని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వొడిదల ప్రణవ్ అన్నారు. హుజరాబాద్ నియోజకవర్గంలో వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన చెక్కులను శుక్రవారం రోజున అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధులు కొంతవరకు కుటుంబాలకు భరోసాగా ఉంటుందని..అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు జరుగుతున్నాయని, రోగులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్లను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అదనపు బెడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో వీణవంక మండల అధ్యక్షులు సాహెబ్ హుస్సేన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏఎస్ఐ లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివి

## వీడ్కోలు సమావేశంలో జమ్మికుంట సి.ఐ. వరగంటి రవి





**జమ్మికుంట ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో ఏ ఎస్ ఐ గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందుతున్న లక్ష్మారెడ్డి సేవలు మరువ లేనివని ఇన్స్పెక్టర్ వరగంటి రవి అన్నారు. ఈనెల 31వ తేదీన పదవి విరమణ పొందుతున్న లక్ష్మారెడ్డి ముందస్తు గా సెలవు పై వెళు ్తుండడంతో ఆయనకు శుక్రవారం పోలీస్ స్టేషన్లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, ఏఎస్ఐ లక్ష్మారెడ్డి బాధ్యతగా తన విధులు నిర్వహిస్తూ అటు అధికారుల నుండి ఇటు ప్రజల నుండి మంచి పేరు తెచ్చుకున్నారని మచ్చలేని అధికారిగా గుర్తింపు తెచ్చుకొని పదవి విరమణ పొందడం బాధాకరమైనప్పటికీ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని ఇన్స్పెక్టర్ అన్నారు. లక్ష్మారెడ్డి తన శేష జీవితాన్ని ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా గడపాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు హెడ్ కానిస్టేబుళ్లు సదయ్య, మోహన్,ప్రవళిక, యాకూబ్ హోమ్ గార్డ్స్ అశోక్, రమేష్, పద్మ, తదితరులు ఉన్నారు.

# హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిత్యవసరసరుకుల పంపిణీ




**నల్గొండ అగస్ట్ 23 (ప్రజామంటలు) :** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణం, మారుతి నగర్ లో నివాసం ఉంటున్న జంపాల గోపాల్ కండరాలు క్షీణిత వ్యాధితో బాధపడుతున్న బాధితునికి దాతలు సహకారంతో 6 వేల రూపాయల విలువ గల నిత్యవసర సరుకులులి పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. రవి నాయక్ మాట్లాడుతూ.... గతంలో మే నెలలో కూడా నిత్యవసర సరుకులు అందించామన్నారు. అందించిన సరుకులు అయిపోవడంతో తిరిగి రెండోసారి దాత కొమరవోలు సంగీత సహకారంతో జంపాల గోపాల్ కు కండరాలు క్షీణిత వ్యాధితో 24 సంవత్స రాలుగా మంచానికే పరిమితమైనాడు. మంచం పైనే తన తల్లి చంటి పిల్లోడు లెక్క అన్ని సేవలు అందిస్తుంది. తను అనారోగ్య పాలవడంతో తన తల్లి వయసు పై పడడంతో కుటుంబం గడవడం చాలా ఇబ్బందికర పరిస్తితుల్లో ఉన్నా కుటుంబానికి దాతల సహకారంతో నిత్యవసర సరుకులు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామల్ పాల్గొన్నారు.

# కాలిఫోర్నియాలో తెలుగు తేజం

## చిరంజీవి వర్షిణి నాగం భరతనాట్య రంగప్రవేశం



**హైదరాబాద ఆగస్ట్ 23 (ప్రజామంటలు):** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్ర రాజధాని నగరమైన శాక్రమెంటో లో హారిస్ సెంటర్ థియేటర్లో ఆగస్టు 18, 2024 న ప్రవాసాంధ్ర చిరంజీవి. వర్షిణి నాగం భరతనాట్య రంగప్రవేశం కార్యక్రమం వైభవంగా జరిగింది. గురువు శ్రీమతి హేమ సత్యనారాయణన్ శిక్షణలో తన 16వ ఏట చిరంజీవి వర్షిణి భరతనాట్య రంగప్రవేశం కార్యక్రమంకు ఉపక్రమించింది. ప్రాచీన నాట్య కళలకు అంతంత మాత్రంగా ప్రోత్సాహం ఉన్న ఈ రోజుల్లో, ఈ తెలుగు తేజం భరతనాట్యం ప్రదర్శించిన తీరు ఆద్యంతం అలరించింది. తన హావభావాలతో, నాట్య భంగిమలతో వర్షిణి దాదాపు మూడు గంటలపాటు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ భరతనాట్యం రంగప్రవేశం ప్రదర్శనకు శ్రీసాయి రాతిన సభాపతి గాత్రం, గజేంద్రన్ గణేశన్ మృదంగం, రాధాకృష్ణన్ సెల్వప్రసాద్ వయొలిన్,కడప రాఘవేంద్రన్ వేణువు, చిరంజీవి. విశాల్ వెంకటేశ్వరన్ కంజీర వాద్య సహకారం అందించారు.

# ఎల్కతుర్తి బస్టాండులో ప్రతి బస్సు ఆగాలని ఆర్ఎం ను కలిసిన

## కాంగ్రెస్ నాయకులు



**ఎల్కతుర్తి ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** ఎల్కతుర్తి మండలంలోని బస్టాండులోనికి ఇంతకుముందు హుజరాబాద్ డిపో ప్రతి బస్సు ఆగేది ఈ మధ్యకాలంలో కొన్ని బస్సులు ఆగడం లేదు ఎందువలన అని అడగగా ఆర్టీసీ యాజమాన్యం స్టాపులు తీసేసారు అని చెప్పారు ఇందుకుగాను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్టీసీ ఆర్ఎం విజయభాను కలిసినవారు ఎల్కతుర్తి బస్టాండ్ లో ప్రతి బస్సు నిలపాలని తెలంగాణ అన్ని డిపోల బస్సులన్నీ ఆగాలని కాంగ్రెస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పాక రమేష్ ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లిపోగు రమేష్ బాబు ఎల్కతుర్తి కాంగ్రెసు మండల ప్రధాన కార్యదర్శి గూడెల్లి నవీన్ కుమార్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయ్ కలకోట వెంకటయ్య ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శనిగారపు వెంకటేష్.ఆర్టీసీ ఎల్కతుర్తి బస్టాండ్ లో ప్రతి ఆర్టీసీ డిపో బస్సునిలుపుటకు ఆర్ఎం హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

## ఎర్రబెల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో

### కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన ఒడితల ప్రణవ్ బాబు



**జమ్మికుంట ఆగస్ట్ 23 (ప్రజామంటలు) :** హుజరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామం నుండి జమ్మికుంట మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు గారి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బల్మూరి రాజేశ్వరరావు, గాదె వీర గోపాల్ గారితో పాటు 25 మందికి నియోజక వర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు కాంగ్రెస్ కండువాలు కప్పి వారిని పార్టీలోకి చేర్చుకోవడం జరిగింది. వారితో పాటు ఈ కార్యక్రమంలో వావిలాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పుల్లూరి సదానందం, మాదారపు లింగారావు తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తేదీ గడువు ముగిసిన వస్తువులు

## అమ్ముతున్న వ్యాపారిపై చర్యల కై డిమాండ్

**రాయికల్ ఆగస్ట్ 23 ( ప్రజా మంటలు ) :** తేదీ గడువు (ఎక్స్పైర్ )అయిన సామాగ్రిని అమ్ముతున్న వ్యక్తి పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు .జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో రునిజ్ జనరల్ కిరాణం స్టోర్ లో ఎక్స్పైర్ అయిన సామాగ్రిని ప్రజలకు అమ్ముతున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు .గోధుమ పిండిలో లక్కపురుగులు లాంటివి తేదీ గడువు ముగిసిన చాక్లెట్లు బిస్కెట్స్ అమ్ముతున్నారని పలు మార్లు కిరాణం యజమానికి చెప్పిన పట్టించుకోకపోవడం తో కొంత మంది షాప్ మాజమానిని నిలదీయడం జరిగింది. అయిన కూడా పట్టించుకోకపోవడంతో పాటు నువ్వు ఎవరికి చెప్పుతావో చెప్పుకో అని అనడంతో చివరికి మీడియాను ఆశ్రయించారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల ఆరోగ్యానికి హాని చేసే తేదీగడువు తీరిన వస్తువుల అమ్మకాలను నిలుపుదల చేసి సదరు వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# గాంధీ డైట్ క్యాంటీన్ లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు చేయులేదు

**సికింద్రాబాద్ ఆగస్ట్ 23 ( ప్రజామంటలు):** పేషంట్లకు ఫుడ్డును అందించే గాంధీ ఆసుపత్రి డైట్ క్యాంటీన్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, డైట్ క్యాంటిన్ లో ఎలాంటి తనిఖీలు జరగలేదని, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. గాంధీ పేషంట్లు, డ్యూటీ డాక్టర్లకు అందించే ఫుడ్డు నాణ్యతతో కూడుకున్నదని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే పేషంట్లకు ఆహారం అందిస్తున్నామని తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com